# భారత శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 172 | హైదరాబాద్ | శనివారం 27-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

భారత్‌కు ముప్పుగా చైనాపాక్

## ‘మిలిటరీ బంధం’..

అగరుబత్తీలపై కేంద్రం కొత్త ప్రమాణాలు..

# వినియోగదారుల భద్రతే లక్ష్యం

- అగరుబత్తీల తయారీలో కీలక మార్పులు
- బీఐఎస్ కొత్త ప్రమాణాలు విడుదల
- హానికర రసాయనాలు, సువాసనల వాడకంపై నిషేధం
- నాణ్యమైన ఉత్పత్తులకు బీఐఎస్ స్టాండర్డ్ మార్క్
- భారత ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌లో పెరగనున్న ఆదరణ



11లో



11లో

# రైతు భరోసాకు కొత్త రూల్స్..

ఇకపై సాగు చేసేవారికే పెట్టుబడి సాయం

- సంక్రాంతి కానుకగా యాసంగి రైతు భరోసా నిధులు
- ఈసారి కొత్త నిబంధనలు.. శాటిలైట్‌తో భూముల పరిశీలన
- పంట సాగు చేసే నిజమైన రైతులకే పెట్టుబడి సాయం
- సాగులో లేని భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు కోత
- అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై అధికారిక ప్రకటనకు అవకాశం


11లో

బాల పురస్కారం అందుకున్న

## క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ

- 14 ఏళ్ల క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్
- ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు ప్రధానం
- పురస్కార కార్యక్రమం కారణంగా విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌కు దూరం
- అండర్-19 ప్రపంచకప్ కోసం భారత జట్టుతో చేరనున్న వైభవ్

కీలక నేతలతో

# కేసీఆర్ భేటీ..

గరంగరంగా తెలంగాణ రాజకీయం

- ఫామ్ హౌస్ లో కేటీఆర్, హరీశ్ తదితరులతో కేసీఆర్ భేటీ
- అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- ఫోన్ ట్యాంపింగ్ అంశంపై కూడా చర్చ జరిగినట్టు సమాచారం


11లో




11లో

హెచ్1బీ వీసా అంశంపై

## స్పందించిన భారత్

- వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో ఇబ్బందులు
- ఫిర్యాదులు అందినట్లు తెలిపిన రణధీర్ జైశ్వాల్
- భారత సంతతి వ్యక్తి మృతిపై కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అన్న భారత్


11లో

# నేటి నుంచి పెరిగిన రైలు ఛార్జీలు

- సబర్బన్, సీజన్ టికెట్లకు మినహాయింపు
- కిలోమీటర్‌కు 1 నుంచి 2 పైసల వరకు పెంపు
- నిర్వహణ ఖర్చుల వల్లే పెంచవలసి వచ్చిందంటున్న ప్రభుత్వం
- ప్రభుత్వ నిర్ణయంపై విపక్షాల తీవ్ర విమర్శలు

ప్రాచీన విజ్ఞానానికి

# భారత్ పుట్టినిల్లు: సీఎం చంద్రబాబు

- భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్‌లో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌పై ప్రశంసల వర్షం
- ప్రాచీన కాలంలోనే విజ్ఞానంలో భారత్ అగ్రగామి : సీఎం
- యోగా, ఆయుర్వేదం, సున్నాను ప్రపంచానికి అందించింది మనమేనని వెల్లడి
- ఆర్యభట్ట, కౌటిల్యుడు వంటి మహానుభావులు మనకు స్ఫూర్తిదాయకమన్న సీఎం


11లో

భారత శక్తి®

# ఓ వైపు బంగ్లాదేశ్.. మరో వైపు పాకిస్తాన్

బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ పాకిస్తాన్ విషయంలో చాలా కఠినంగా ఉండేవారు. బంగ్లాదేశ్‌ను గుర్తించకపోవడంతో పాకిస్తాన్ అధ్యక్షుడు జుల్ఫికార్ అలీ భుట్టోతో మాట్లాడేందుకు షేక్ ముజిబుర్ రెహమాన్ నిరాకరించారు. పాకిస్తాన్ మొదట బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని తిరస్కరించింది. తర్వాతి రోజుల్లో పాకిస్తాన్ వైఖరి మారింది. 1974 ఫిబ్రవరిలో ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కాన్ఫరెన్స్ సమ్మిట్ లాహోర్‌లో జరిగింది. జుల్ఫికార్ అలీ భుట్టో అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్నారు. ముజిబుర్ రెహమాన్‌కు అధికారిక ఆహ్వానాన్ని పంపించారు. ముజిబ్ మొదట హాజరు కావడానికి నిరాకరించినా తరువాత అంగీకరించారు. పాకిస్తాన్ 1974 ఫిబ్రవరి 22న బంగ్లాదేశ్‌ను గుర్తించింది. భుట్టో ఈ గుర్తింపును 'ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కాన్ఫరెన్స్'లో ప్రకటించారు."అల్లా కోసం మా దేశ పౌరుల తరపున మేం బంగ్లాదేశ్‌ను దేశంగా గుర్తిస్తున్నాం. రేపు ఒక ప్రతినిధి బృందం వస్తుంది. 7 కోట్ల మంది ముస్లింల తరపున మేం వారిని ఆలింగనం చేసుకుంటాం" అని జుల్ఫికార్ అలీ భుట్టో అన్నారు. అయినప్పటికీ రెండు దేశాల మధ్య సంబంధాలు పూర్తిస్థాయిలో దారినపడలేదు. కానీ, ఇప్పుడు సుమారు 52 ఏళ్ల తరువాత రెండు దేశాల మధ్య పరిస్థితులు మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. షేక్ హసీనా అధికారం కోల్పోయిన తర్వాత బంగ్లాదేశ్, పాకిస్తాన్ మధ్య చారిత్రక దూరం తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. బంగ్లాదేశ్‌లో ఇంక్విలాబ్ మంచ్ నాయకుడు ఉస్మాన్ హాదీ డిసెంబర్ 18న మరణించారు. డిసెంబర్ 12న ఢాకాలో గుర్తు తెలియని దుండగులు ఆయనపై కాల్పులు జరిపారు. గతవారం.. బంగ్లాదేశ్‌లో ఫ్యాక్టరీ కార్మికుడైన హిందూ యువకుడిని ఒక గుంపు కొట్టి చంపింది. ఈ సంఘటన తర్వాత భారత్- బంగ్లాదేశ్ సంబంధాల్లో ఉద్రిక్తత పెరిగింది. ఆ తర్వాతి పరిణామాలతో రెండు దేశాల మధ్య వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. డిసెంబర్ 20న, పాకిస్తాన్ జమాత్ ఏ ఇస్లామీ మాజీ అధ్యక్షుడు అమీర్ సిరాజ్-ఉల్ హక్ బంగ్లాదేశ్ యువతను ప్రశంసిస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు."బంగ్లాదేశ్‌లోని విద్యావంతులు, ధైర్యవంతులైన యువత అఖండ భారత్ అనే ఆలోచనను ధ్వంసం చేసింది. భారత్ ఈ ప్రాంతంలో అస్థిరతను సృష్టిస్తోంది. కెనడా, పాకిస్తాన్ తర్వాత బంగ్లాదేశ్‌లో భారత్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, హత్యలు చేస్తోందనే ఆరోపణలు వచ్చాయి" అని ఆయన అందులో రాశారు. ఉస్మాన్ హాదీ హంతకులు భారత్‌లో తలదాచుకున్నారని బంగ్లాదేశ్‌లోని సోషల్ మీడియాలో వదంతులు వ్యాపించాయి. అయితే దీనిపై బంగ్లాదేశ్ పోలీసులు కానీ, ప్రభుత్వం కానీ అధికారికంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. రెండు దేశాల్లోనూ సామాజిక మాధ్యమాల్లో విస్తరిస్తున్న వదంతులు భారత్- బంగ్లా మధ్య దౌత్య సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయి. బంగ్లాదేశ్‌లోని భారత్ దౌత్య కార్యాలయాల ఎదుట నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. హిందూ యువకుడి హత్యను నిరసిస్తూ దిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం ఎదుట ఆందోళన జరిగింది. భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై భారత విదేశీ వ్యవహారాల శాఖ డిసెంబర్ 17న స్పందించింది"బంగ్లాదేశ్‌లో ఇటీవలి కొన్ని సంఘటనలకు సంబంధించి ఛాందసవాద శక్తులు చేసిన తప్పుడు వాదనలను మేం తిరస్కరిస్తున్నాం. అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ఈ సంఘటనలపై సమగ్ర దర్యాప్తు చేపట్టకపోవడం లేదా భారతదేశంతో ఎలాంటి నిర్దిష్ట ఆధారాలను పంచుకోకపోవడం దురదృష్టకరం" అని తన ప్రకటనలో పేర్కొంది. గతేడాది ఆగస్టులో షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి పారిపోయి భారత్ వచ్చినప్పటి నుంచి పాక్- బంగ్లాదేశ్ సంబంధాలు మెరుగవడం మొదలైంది. పాక్- బంగ్లాదేశ్ మధ్య దూరం నిరంతరం తగ్గుతున్నట్లు కనిపించే అనేక సంఘటనలు జరిగాయి. 1971లో బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం తర్వాత నిరుడు నవంబర్‌లో పాక్- బంగ్లా మధ్య తొలిసారి నేరుగా సముద్ర వాణిజ్యం జరిగింది. గతంలో రెండు దేశాల మధ్య సముద్ర వాణిజ్యం సింగపుర్ లేదా కొలంబో ద్వారా జరిగేది."పాకిస్తాన్‌లోని కరాచీ నుంచి బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ ఓడరేవుకు నేరుగా కార్గో నౌక చేరుకోవడం ఇదే తొలిసారి. ద్వైపాక్షిక సంబంధాల్లో ఇది కీలకమైన ముందడుగు" అని బంగ్లాదేశ్‌లోని పాకిస్తాన్ హై కమిషన్ ఒక ప్రకటనలో పేర్కొంది. బంగ్లాదేశ్‌లోని పాకిస్తాన్ హైకమిషనర్ సయ్యద్ అహ్మద్ మరూఫ్ నిరుడు నవంబర్ 6న "పాకిస్తాన్‌లోని బంగ్లాదేశ్ పౌరులకు ఉచితంగా వీసాలు ఇస్తాం. వారి వీసా దరఖాస్తులపై 48 గంటల్లోపు నిర్ణయం తీసుకుంటాం. వారు చేయాల్సిందల్లా వెబ్‌సైట్‌లో సమాచారాన్ని అందించడమే. వీసాలలో వ్యాపార, పర్యటక వీసాలున్నాయి. టూరిస్టు వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు రిటర్న్ టికెట్, వసతి గురించి సమాచారం అందిస్తే చాలు" అని చెప్పారు. షేక్ హసీనా దేశం విడిచి వెళ్లిన తర్వాత బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ కీలకమైన రాజకీయ శక్తిగా ఎదుగుతున్నట్లు కనిపిస్తోంది. పాకిస్తాన్ జమాత్ ఏ ఇస్లామీ, బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ మధ్య సైద్ధాంతిక సారూప్యత ఉంది. బంగ్లా విముక్తి యుద్ధంలో భారత్ పాత్రను జమాత్ ఏ ఇస్లామీ ప్రశ్నిస్తోంది. షేక్ హసీనా నిష్క్రమణ తర్వాత ఢాకాలోని బంగ్లాదేశ్ విముక్తి యుద్ధానికి చెందిన చారిత్రక వారసత్వంపై దాడులు, విధ్వంసం జరిగాయి. బంగ్లాదేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటిపై దాడి జరిగింది. ముహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వానికి బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ మద్దతు ఇస్తోంది."1971లో మా వైఖరి సూత్రప్రాయంగా ఉంది. భారత్ ప్రయోజనాల కోసం మేం స్వాతంత్ర్యం కోరుకోలేదు. పాకిస్తాన్ మాకు ఓటుహక్కు కల్పించాలని కోరుకున్నాం. అలా జరిగి ఉండకపోతే చాలా దేశాల మాదిరే గెరిల్లా యుద్ధంతో స్వాతంత్ర్యం సిద్ధించేది" అని 2025 ఫిబ్రవరిలో బంగ్లాదేశ్ వార్తా వెబ్‌సైట్ ప్రథమ్ అలోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బంగ్లాదేశ్ జమాత్ ఏ ఇస్లామీ చీఫ్ షఫీకుర్ రెహమాన్ చెప్పారు."మనం ఎవరి ద్వారా అయినా స్వాతంత్ర్యం పొందితే, లేదంటే ఎవరి తరఫునైనా స్వాతంత్ర్యం పొందితే అది ఒక భారాన్ని వదిలించుకుంటూ మరో భారాన్ని మోయడం ప్రారంభించినట్లవుతుంది. 53 ఏళ్లుగా బంగ్లాదేశ్ విషయంలో ఇది నిజం కాదా? ఒక పార్టీని ఇష్టపడని దేశం మాట మేమెందుకు వినాలి? ఆ దేశం కోరుకోక పోతే మేం అధికారంలోకి రాకూడదా? ఒక స్వతంత్ర దేశంలో ఇలాంటి పరిస్థితి ఉండాలా? ఇదంతా వినడానికి ఇకపై బంగ్లాదేశ్ యువత ఏ మాత్రం సిద్ధంగా లేదు" అని ఆయన అన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితుల వల్ల భారత్‌కు ముప్పు పెరగవచ్చని ఆయన అన్నారు. 54 ఏళ్ల వాజీద్ అమెరికాలో నివసిస్తున్నారు."ఇది భారతదేశానికి తీవ్ర ఆందోళన కలిగించే విషయం. అవామీ లీగ్ ప్రభుత్వం భారతదేశ తూర్పు సరిహద్దులను అన్ని ఉగ్రవాద కార్యకలాపాల నుంచి సురక్షితంగా ఉంచింది. బంగ్లాదేశ్‌తో వేగంగా క్షీణిస్తున్న సంబంధాలు భారతదేశానికి మూడు వైపులా సవాలును విసురుతున్నాయి. 4వేల కిలోమీటర్ల పొడవైన సరిహద్దులో చొరబాటు ముప్పు పెరుగుతుంది. భారత వ్యతిరేక శక్తులు సరిహద్దు వెంబడి స్థావరాలను ఏర్పాటు చేసుకునే ప్రమాదం ఉంది" అని జాకబ్ రాశారు. భారతదేశం, బంగ్లాదేశ్ మధ్య ఉద్రిక్తతలను పాకిస్తాన్, చైనా ఆసరాగా చేసుకుంటున్నాయి.

# పరకామణి, కల్తీ నెయ్యి, పట్టు శాలువాలు, గోవిందరాజు స్వామి టెంపుల్.. ఈ ఏడాదంతా తిరుపతి చుట్టే ఇలా..!






తిరుమల, డిసెంబర్ 25(భారత శక్తి):

ఏడుకొండల వాడు, వడ్డీకాసుల వాడు..కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి సన్నిధిలో..నిత్యం ఏదో ఒక ఇష్యూ సంచలనం సృష్టిస్తూనే ఉంది. ఇప్పటికే కల్తీ నెయ్యి, పరకామణి చోరీ ఎపిసోడ్ కొండంత వివాదంగా ఉండగా..ఈ మధ్యే పట్టు శాలువాల స్కామ్ అంటూ దుమారం లేచింది. ఈ ఇష్యూ అలా చల్లారిందో లేదో..ఇప్పుడు ఇంకో వివాదం వెలుగులోకి వచ్చింది. తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. గోవిందరాజస్వామి ఆలయంలో 50 కిలోల బంగారం మాయం చేశారన్న ప్రచారం సెన్సేషనల్ అవుతోంది. విమాన గోపురం బంగారం తాపడం పనులకు గత ప్రభుత్వం 100 కిలోల బంగారం కేటాయించగా..అందులో 50 కేజీల గోల్డ్‌ను మాయం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. 9 లేయర్లతో బంగారం తాపడం వేయాల్సి ఉండగా 2 లేయర్లే వేశారన్న టాక్ వినిపిస్తోంది. బంగారం తాపడం పనులు అసలు కాంట్రాక్టర్ కాకుండా సబ్ కాంట్రాక్టర్ నిర్వహించారన్న చర్చ జరుగుతోంది. ఆలయ గోపురంపై అప్పట్లో 30పైగా విగ్రహాలు ధ్వంసం చేసి బంగారం తాపడం పనులు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అవకతవకలపై చాలా సీక్రెట్‌గా విజిలెన్స్ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. లేటెస్ట్ వ్యవహారంపై మరోసారి తిరుమల శ్రీవారి సెంట్రిక్‌గా తీవ్ర దుమారం నడుస్తోంది. గోవిందరాజస్వామి ఆలయ గోపుర తాపడం కోసం కేటాయించిన బంగారంలో గోల్‌మాల్ జరిగిందన్న ప్రచారం పొలిటికల్ కాంట్రవర్సీ అవుతోంది. ఇప్పటికే కల్తీ నెయ్యి ఎపిసోడ్ నేషనల్ టాపిక్ అయింది. దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసి..హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా చేసింది. ఆ తర్వాత పాత ఇష్యూ పరకామణి చోరీ కేసు కలకలం సృష్టించింది. ఫిర్యాదుదారుడు, సాక్షిగా ఉన్న ఆఫీసర్ అనుమానాస్పద మృతి చెందడంతో కూటమి వర్సెస్ వైసీపీ డైలాగ్ వార్‌కు దారితీసింది. ఇక శ్రీవారి పట్టువస్త్రాల స్కామ్ కూడా హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు గోవిందరాజస్వామి ఆలయ తాపడం వ్యవహారంతో మరోసారి తిరుమల చుట్టే చర్చ జరుగుతోంది. ఏడాది కాలంలోనే నాలుగు అంశాలు శ్రీవారి భక్తుల మనసును గాయపరిచాయి. కల్తీ నెయ్యి, పరకామణి కేసులో వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ ఈవోలు అలిగేషన్స్ ఫేస్ చేస్తున్నారు. పట్టు శాలువాల వ్యవహారంలో విజిలెన్స్ దర్యాప్తు ఉత్కంఠ రేపుతోంది. గోవిందరాజ స్వామి ఆలయ గోపురం తాపడం తయారీలో..50 కిలోల బంగారం చోరీ అయినట్లు ప్రచారం జరుగుతుండటం సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వంలో తిరుమలలో జరిగిన అక్రమాలన్నీ ఒక్కొక్కటి బయటికి తీస్తున్నామని కూటమి పెద్దలు చెప్తుంటే..ప్రతీదానికి వైసీపీకి లింకు పెట్టే కుట్ర చేస్తున్నారని ఫ్యాన్ పార్టీ లీడర్లు రివర్స్ అటాక్ చేస్తున్నారు. తమను హిందూ వ్యతిరేకులుగా చూపించి..లబ్ధి పొందే ప్రయత్నమే తప్ప..అసలు వాస్తవాలేంటో తేల్చడంలో ప్రభుత్వం ఫెయిల్ అయిందంటున్నారు వైసీపీ నేతలు. రూమర్స్, గాలి ప్రచారమే తప్ప..ఎక్కడా తప్పు జరిగినట్లు ప్రూవ్ చేయలేదని..ఏడాది కాలంలో కూటమి సర్కార్ గోబెల్స్ ప్రచారంతో నెట్టుకొస్తుందని ఫ్యాన్ పార్టీ లీడర్లు విమర్శిస్తున్నారు. ఇలా కల్తీ నెయ్యి, పరకామణి చోరీ కేసు, పట్టు శాలువాల స్కామ్..ఇప్పుడు గోవిందరాజస్వామి బంగారం ఇష్యూపై..పొలిటికల్ వార్ నడుస్తుంది. మరోవైపు శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతినడం ఆందోళన కలిగిస్తోంది. వరల్డ్ వైడ్‌గా ఎంతో పేరు ప్రతిష్టలు.. అన్నింటికి మించి కోట్లాది మంది భక్తుల విశ్వాసంగా ఉన్న శ్రీవారి సన్నిధిలో వరుస సంఘటనలు కలకలం రేపుతున్నాయి. గోవిందరాజస్వామి ఆలయ గోపురం బంగారం వ్యవహారం..ఎటు టర్న్ తీసుకుంటుందో..ఎవరి మెడకు ఉచ్చు బిగుసుకుంటుందో వేచి చూడాలి.

# మేకపాటి స్థానంలో కొత్త నేత



నెల్లూరు, డిసెంబర్ 25(భారత శక్తి):

జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా చాలా కుటుంబాలు అండగా నిలిచాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం నేతలు తమ సొంత పార్టీలను వదిలి జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కానీ ఆ పార్టీలో అనుకున్న స్థాయిలో గుర్తింపు సాధించుకోలేకపోయారు. దీంతో ఒక్కొక్కరు బయటకు వెళ్ళిపోయారు. ఇప్పుడు మరో పొలిటికల్ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అటు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫ్యామిలీని లైట్ తీసుకోవడంతో ఇక పార్టీలో ఉండడం భావ్యం కాదని భావిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతను బరిలోదించేందుకు అప్పుడే అన్వేషణ ప్రారంభించారట జగన్మోహన్ రెడ్డి. దీంతో ఆ ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు పరిమితమైంది. ఎన్నికల ముంగిట ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్ పార్టీని విభేదించి జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి ఫ్యామిలీ చేరింది. మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్. 1989 నుంచి ఆయన ఎంపీ గానే పోటీ చేస్తూ గెలుస్తూ వచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఎంపీ పదవిని వదులుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. 2012 ఉప ఎన్నికల్లో గెలిచారు కూడా. 2014 ఎన్నికల్లో సైతం ఆయనే సత్తా చాటారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి. అయితే 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్నారు. ఆయన బదులు కుమారుడు గౌతమ్ రెడ్డి రంగంలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహిత నేత గౌతమ్ రెడ్డి. ఆయన వల్లే ఆ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2019 ఎన్నికల్లో గౌతంరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అయితే 2022లో చనిపోయారు గౌతమ్ రెడ్డి. ఆయన స్థానంలో తమ్ముడు విక్రమ్ రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ జగన్ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అప్పటినుంచి మేకపాటి ఫ్యామిలీలో ఒక రకమైన అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్ ఇచ్చారు జగన్. అయితే నెల్లూరు జిల్లాలో నేతలంతా బయటకు వెళ్లిపోవడంతోనే జగన్ మేకపాటి ఫ్యామిలీకి రెండో టిక్కెట్ కల్పించారు. కానీ 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రాజమోహన్ రెడ్డి కి ప్రాధాన్యత తగ్గించారు జగన్మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు పై దృష్టి పెట్టింది మేకపాటి ఫ్యామిలీ. ఇటీవల నెల్లూరు వచ్చిన రాజమోహన్ రెడ్డి పార్టీ అధినేత తీరు మార్చుకోవాలని సూచిస్తూ విలువైన సలహాలు ఇచ్చారు. అయితే దీనిని సానుకూలంగా తీసుకోకుండా ప్రతికూలంగా తీసుకున్నట్లు తెలుస్తోంది జగన్మోహన్ రెడ్డి. అందుకే ఆయన స్థానంలో టిడిపిలో ఉన్న ఒక బడా నేతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం టిడిపిలో ఎంపీగా ఉన్న ఓ నేతను నెల్లూరుకు రప్పించి ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అతని కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తానని కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈ పరిస్థితులు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ సీనియర్ నేత దూరమైనట్టే.

# ఫస్ట్ నుంచి ఇంటింటి సర్వే

ఒంగోలు, డిసెంబర్ 25(భారత శక్తి):

ఏపీలోని కూటమి ప్రభుత్వం పేద వర్గాల ప్రజలు, మహిళల ఆర్థిక అభివృద్ధికోసం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ క్రమంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటుంది. అయితే, తాజాగా.. ఏపీలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటి సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి ఇంటి వివరాలను ప్రభుత్వ రికార్డులలో ఖచ్చితంగా నమోదు చేసేందుకు ఈ సర్వే నిర్వహించనున్నారు. ఏకీకృత కుటుంబ సర్వే -జఈూ ప్రారంభిస్తున్నట్లు తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిసెంబర్ నెల చివరి వారం నుంచి ఏకీకృత కుటుంబ సర్వే ప్రారంభమవుతుందని ప్రభుత్వం వెల్లడించిందిపట్టణాల్లో సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుని రికార్డులను సిబ్బంది నవీకరించనున్నారు. అర్హత కలిగిన కుటుంబం, వ్యక్తి ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడమే లక్ష్యంగా ఈ సర్వేను ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సర్వే ద్వారా వచ్చిన సమాచారం ఆధారంగా నిజమైన అర్హులను ప్రభుత్వం గుర్తించనుంది. ప్రభుత్వ సమాచారం కచ్చితత్వం, పరిపూర్ణతను మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహించనుంది. కుటుంబ వివరాలను నేరుగా ఇంటి వద్దకు వెళ్లి సిబ్బంది పొందుపర్చనున్నారు. ప్రభుత్వం ఖచ్చితంగా డేటా రూపొందించడం సహా పథకాలను మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రభుత్వ సిబ్బంది సర్వేను చేపట్టనున్నారు. తద్వారా సమాచారం ఖచ్చితంగా నమోదు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ప్రభుత్వ పాలన మరింత పారదర్శకంగా సాగేందుకు సర్వే ఉపయోగపడుతుందని ప్రభుత్వం తెలిపింది. అర్హులైన అన్ని కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సేవలను అందించేందుకు ఈ సర్వే చేస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

# బెజవాడలో 51 పంచాయితీల విలీనం


విజయవాడ, డిసెంబర్ 25(భారత శక్తి):

అమరావతి రాజధాని నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రాజధాని లో నవ నగరాలు నిర్మించాలన్నది చంద్రబాబు ప్రణాళిక. మరోవైపు విజయవాడ, గుంటూరు నగరాలతో అమరావతిని కలుపుతూ అభివృద్ధి చేస్తారని అంతా భావించారు. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వేరే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. అమరావతికి ఇంకా నగర రూపురేఖలు ఏర్పడకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయం ఆలోచిస్తోంది. పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ఐటీ కంపెనీలను తీసుకురావాలన్న ఆలోచనతో ఉంది. అందుకే ఇప్పుడు విజయవాడ ను గుర్తించి గ్రేటర్ గా మార్చాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 75 గ్రామపంచాయతీలను విజయవాడ నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదన త్వరలో అమలు చేయనున్నట్లు సమాచారం. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ను గ్రేటర్ సివిక్ బాడీగా అప్గ్రేడ్ చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తో పాటు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సీఎం చంద్రబాబు నాయుడు ను కలిసి మహా విజయవాడ ప్రతిపాదనలను అందించారు. దీంతో విజయవాడ మహానగరం ఆవిర్భావానికి అడుగులు పడినట్లు అయింది. 2017లో నగరపాలక మండలి 51 పంచాయితీల విలీనం ప్రతిపాదన చేయగా.. ఇప్పుడు ఆ జాబితాలో మరో 24 పంచాయితీలను చేర్చారు. దీంతో విజయవాడ ప్రస్తుత జనాభా 23.5 లక్షల నుంచి రెట్టింపు కానుంది. నగర పరిమాణం ఐదు రెట్లు పెరగనుంది. ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదిస్తే విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రస్తుతం ఉన్న 61.8 చదరపు కిలోమీటర్ల నుంచి.. 500 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. ఈ విలీన ప్రతిపాదనను ఏపీ ప్రభుత్వం ఆమోదిస్తే.. విశాఖపట్నందాటి రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ గా విజయవాడ అవతరించనుంది. అయితే ఈ విలీన ప్రతిపాదనను చాలామంది వ్యతిరేకిస్తున్నారు. విలీనం కాకుండా వికేంద్రీకరణ కావాలని కోరుతున్నారు. ఈ ప్రతిపాదనపై పౌర సంఘాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం విజయవాడ ఆంధ్రప్రదేశ్ లో రెండో అతిపెద్ద నగరంగా ఉంది. గ్రేటర్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా కొన్ని వర్గాలు వ్యతిరేకించడం జరుగుతోంది. గతంలో హైదరాబాద్ విషయంలో కూడా ఇలానే జరిగింది. ప్రభుత్వం మాత్రం స్ట్రాంగ్ గా నిర్ణయించుకుంటే మాత్రం విజయవాడ గ్రేటర్ గా మారడం ఖాయం. తాజాగా విజయవాడను గ్రేటర్ సిటీగామార్చాలన్న ప్రతిపాదన వచ్చిన నేపథ్యంలో.. అమరావతిలో కలపాలన్న డిమాండ్ తెరమరుగు అయినట్టే. అయితే ఇప్పుడు రాష్ట్రానికి రాజధానికి దగ్గరగా ఒక నగరం అవసరం. ఐటీ పరిశ్రమలన్నీ విశాఖకు వెళ్ళిపోతున్నాయి. రాయలసీమలో తయారీ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. ఈ క్రమంలో అమరావతి రాజధాని లో ఎటువంటి పెట్టుబడులు లేవన్న విమర్శలు వస్తున్నాయి. అందుకే గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనను ఆమోదించి.. మహానగరంలో పెట్టుబడులు ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

# భీమిలీలో వారుసుడికి లైన్ క్లియర్

విశాఖపట్టణం,డిసెంబర్ 25(భారత శక్తి):

గంటా శ్రీనివాసరావు. టీడీపీలోనూ, ప్రజారాజ్యంలోనూ, కాంగ్రెస్‌లోనూ..ఎక్కడున్నా కీలక పదవుల్లో కొనసాగారు. రెండు దశాబ్ధాలకుపైగా రాజకీయాల్లో ఉన్న ఆయన ఓటమి ఎరుగని



నేతగా పేరు సంపాదించారు. అయితే 2024 ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీ చేసి గెలిచిన గంటా మళ్లీ మంత్రి కావాలనుకున్నారు. కానీ ఆ ఆశ నెరవేరడం లేదు. గంటాకు మంత్రి పదవి దక్కకపోవడానికి చాలా రీజన్స్ ఉన్నాయని చర్చ జరుగుతోంది.సామాజిక వర్గ సమీకరణాల్లో భాగంగా గంటాకు అమాత్య యోగం దక్కలేదని కొందరు చెబుతున్నా, అసలు అధిష్టానమే ఆయన్ను పక్కన పెట్టిందన్న టాక్ ఉంది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకి అంటీముట్టనట్లుగా వ్యవహరించారని ..చంద్రబాబు అరెస్ట్‌పై గంటా రియాక్ట్ కాలేదని ఆయనపై పార్టీ అధిష్టానం అసంతృప్తిగా ఉందట.టీడీపీని వీడి వైసీపీలో చేరేందుకు గంటా శ్రీనివాసరావు ప్రయత్నాలు చేశారని అప్పట్లో ప్రచారం బాగా జరిగింది. దీంతో అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ అధిష్టానం గంటాను పక్కన పెట్టేసిందన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలకంగా ఉన్న మంత్రి లోకేశ్ కూడా గంటాను దగ్గరకు రానివ్వడం లేదట. 2014 హయాంలో చంద్రబాబు కాకుండా లోకేశ్ నాయకత్వాన్ని అప్పట్లో గంటా మనస్ఫూర్తిగా స్వాగతించలేకపోగా, ఎడమొహం పెడమొహంగా ఉండేవారట. ఈ పరిస్థితలన్నింటినీ గమనించిన లోకేశ్ ఇప్పుడు గంటాకు మంత్రి పదవి ఇవ్వలేదనే టాక్ నడుస్తోంది.గతంలో రెండుసార్లు మంత్రి, ఓ సారి ఎంపీగా..విశాఖలో బుగ్గకారులో రయ్ రయ్‌మంటూ తన హవాను నడిపించిన గంటా, ఇప్పుడు కేవలం ఎమ్మెల్యేగా పరిమితం కాలేకపోతున్నారట. పోనీ తర్వాత ఎప్పుడైనా మంత్రివర్గ విస్తరణ జరిగితే ఛాన్స్ వస్తుందా అంటే అదీ డౌటేనని తెలిసిపోయిందట.తన సహచరులైన అయ్యన పాత్రుడు స్పీకర్‌గా, ఒకప్పుడు తాను ఎమ్మెల్యే సీటు ఇప్పించిన ఎమ్మెల్యే వంగలపూడి అనిత హోంమంత్రిగా, గాజువాక ఎమ్మెల్యేగా ఉన్న పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బుగ్గ కార్లలో తిరుగుతుంటే..తాను మాత్రం ఎమ్మెల్యేగా మిగిలిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. దీంతో గంటా తన పొలిటికల్ బ్రెయిన్‌కు మళ్లీ ఇప్పుడు పని చెప్పారట. అందుకే ఇక రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టి, తన కుమారుడు రవితేజను పొలిటికల్ స్క్రీన్ మీదకు తీసుకురావాలని తహతహలాడుతున్నారని గంటా క్లోజ్ సర్కిల్స్ టాక్.నిజానికి తన కుమారుడు రవి తేజను సిల్వర్ స్క్రీన్‌పై చూడాలని గంటా కోరిక. హీరోగా సినీ రంగంలో నిలబెట్టాలని గంటా ప్రయత్నాలు చేశారు. జయదేవ్ పేరిట గతంలో రవితేజ హీరోగా సినిమా తీశారు. మెగాస్టార్ చిరంజీవితో పాటు పలువురు సినీ ప్రముఖులతో తనకున్న సన్నిహిత సంబంధాలు కలిసి వస్తాయని భావించారట. అయితే ఆ జయదేవ్ మూవీ మొదటి షోతోనే ముగిసిపోవడంతో, ఇక పొలిటికల్ ఫీల్డే బెటర్ అనే నిర్ణయానికి వచ్చారట. అప్పటి నుంచి గంటాకు తోడుగా అడపాదడపా మాత్రమే రాజకీయాల్లో రవితేజ కనిపించేవారు.ఇప్పుడు సీన్ మారింది. గంటా కంటే ఎక్కువగా ఆయన కుమారుడు రవితేజనే భీమిలిలో ఎక్కువగా కనిపిస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంచినా, తల్లికి వందనం నిధులు మంజూరు చేసినా, అన్నదాత సుఖీభవ, ఫ్రీ గ్యాస్, ఉచిత బస్ వంటి పథకాల్ని ప్రారంభించినా సరే రవితేజ యాక్టీవ్‌గా భీమిలి నియోజకవర్గంలో తిరుగు తున్నారు. అలాగే నియోజకవర్గానికి సంబంధించిన కీలక అంశాలపై రవితేజనే అధికారులతో మాట్లాడుతున్నారు. ఇటీవల ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రవితేజ దగ్గరుండి ప్రచారం చేశారు.అలాగే భీమిలి టీడీపీ, జనసేన క్యాడర్‌లో తన పట్టు పెంచుకునేందుకు, అందరికీ అందుబాటులో ఉండే ప్రయత్నం చేస్తున్నారు రవితేజ. ఇదంతా చూస్తున్నవారికి గంటా స్కెచ్ ఏంటో అర్థమైపోయిందట. వచ్చే ఎన్నికల నాటికి తాను ఎంపీగానో మరో పదవికి వెళ్లిపోయి, తన కుమారుడుని లోకేశ్ టీమ్‌లో చేర్పించి మంత్రిని చేయాలనే ఎత్తుగడలో భాగంగానే..భీమిలిలో రవితేజను యాక్టీవ్ చేశారని అంటున్నారు. ఇటు గంటా కుమారుడిగా, అటు మంత్రి నారాయణ అల్లుడిగా కూడా రవితేజకు రాజకీయ బలగం కలిసి రాబోతుందన్న టాక్ వినిపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి రవితేజను అసెంబ్లీకి పంపి తర్వాత మంత్రిని చేయడం పక్కా అని గంటా అనుచరులు కూడా లెక్కలు వేసుకుంటున్నారట. మరి గంటా శ్రీనివాసరావు స్కెచ్ వర్కౌట్ అవుతుందో లేదో చూడాలి మరి.

# రచ్చకెక్కుతున్న టిక్కెట్ రేసు

విజయవాడ, డిసెంబర్ 25(భారత శక్తి):

ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైముంది. కానీ ఇప్పటినుంచే కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ రేసు రచ్చకెక్కుతోంది. మరీ ముఖ్యంగా టీడీపీలో టికెట్ ఫైట్ మామూలుగా లేదు. గత ఎన్నికల్లోనే దాదాపు 50 మంది నేతలు టికెట్ త్యాగం చేయాల్సి వచ్చింది. ఇందులో 20 మంది వరకు సీనియర్ లీడర్లు పార్టీ గెలుపు కోసం..పొత్తుల్లో సీటును వదులుకోవాల్సి వచ్చింది.మరికొన్ని చోట్ల యువనేతలకు నామినేటెడ్ పోస్టుల హామీ ఇచ్చి టికెట్ రేస్ నుంచి తప్పించారు. ఇంకొందరు వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరుగుతుందని..అప్పుడు కచ్చితంగా టికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. కట్ చేస్తే అసెంబ్లీ సీట్ల పెంపుపైన స్పష్టత వచ్చింది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏపీలో 50, తెలంగాణలో 34 అసెంబ్లీ సీట్లు పెరగాల్సి ఉంది. ఒక్కో పార్లమెంట్ స్థానం పరిధిలో రెండు అసెంబ్లీ సీట్లు పెరగాలి. కానీ 2029 ఎన్నికల్లోపే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన పూర్తి కాదని కేంద్రం క్లారిటీ ఇచ్చింది.అయితే 2026లో జనగణన చేపడుతుంటంతో ఇప్పుడు అసెంబ్లీ స్థానాల పెంపు చేయకుండా..సెన్సెస్ పూర్తయిన తర్వాత డీలిమిటేషన్ చేయాలని డిసైడ్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వచ్చే అసెంబ్లీ, లోక్సభ ఎన్నికలు పాత నియోజకవర్గాలతోనే జరుగనున్నాయి. 2029 ఎన్నికల నాటికి అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఆశపడ్డ పార్టీలకు, రాజకీయ నేతలకు బిగ్ షాక్ ఇచ్చినట్లు అయింది. 2024లో కూటమిలో భాగస్వామి అయిన టీడీపీ తమ నేతలకు సీట్లు సర్దుబాటు చేసేందుకు నానా అవస్థలు పడింది.గత ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు చేసేందుకు చివరి క్షణం వరకు బుజ్జగింపులు, సామాజిక సమీకరణాలు, పార్టీలో సీనియర్లకు హామీలు చాలా ప్రాసెస్ నడిచింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యత్వాలు, నామినేటెడ్ పోస్టులతో పాటు పార్టీ పదవుల పంపకం కూడా టీడీపీ హైకమాండ్‌కు ఇబ్బందికరంగా మారింది.టీడీపీకి పట్టు ఉండి..లీడర్ స్ట్రాంగ్‌గా ఉన్న చోటే జనసేన, బీజేపీ టికెట్ కోసం పట్టుబట్టడంతో..చాలా మంది తెలుగు తమ్ముళ్లు సీటు త్యాగం చేశాయి. అధికారంలోకి వస్తే ఏదో పదవి దక్కుతుందని ఆశపడి..ఇప్పటికి ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోపు అసెంబ్లీ సీట్ల పెంపు అయ్యే పని కాదన్న క్లారిటీ వచ్చింది.టీడీపీ హైకమాండ్‌కు ఇప్పటినుంచే గుబులు మొదలైందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ఎన్నికలప్పుడే.. గెలుస్తున్నాం.. అధికారంలోకి వచ్చాక అన్ని విధాలుగా మిమ్మల్ని స్యాటిస్ఫై చేస్తామని కింద మీద పడి హామీ ఒప్పించి టికెట్ త్యాగానికి ఒప్పించారు. ఈ సారి టికెట్ల కేటాయింపు ఎలా.? అసలే ఐదేళ్లు పవర్‌లో ఉంటాం. పైగా అసంతృప్తులు, లీడర్ల వర్గపోరు ఉండనే ఉంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ల కేటాయింపునకు ఇవన్నీ అడ్డంకిగా మారనున్నాయి. ఏం చేసేదని ఇప్పటినుంచే ఆలోచనలో పడిందట టీడీపీ అధిష్టానం.చాలాచోట్ల కూటమిలో వర్గపోరు నడుస్తోంది. స్టార్టింగ్లో కాస్త రచ్చకెక్కిన లీడర్లు..అధినేతల ఆదేశాలతో..సర్దుకోకపోయినా..గొడవ అయితే పడట్లేదు. కలిసి పనిచేయడం కూడా అంతంత మాత్రమే. ఇలాంటి పరిస్థితులున్న వేళ..అసెంబ్లీ ఎన్నికల టికెట్ రేసు..ఇప్పటినుంచే కొన్ని నియోజకవర్గాల్లో కాక రేపుతోంది. అక్కడక్కడ తెలుగు తమ్ముళ్లే తగువ పడుతుంటే..మరికొన్ని చోట్ల, జనసేన, బీజేపీ నేతలతో టీడీపీ నేతలకు టికెట్ ఫైట్ నడుస్తోంది. ఎన్నికల టైమ్ వచ్చే సరికి టికెట్ రేసు, ఆశావహుల ప్రయత్నాలు జోరందుకోవడం ఖాయం. ఇప్పటినుంచే ప్రత్యామ్నాయం ఆలోచించడం..సాధ్యమైనంత వరకు లీడర్లకు టికెట్‌పై క్లారిటీ ఇవ్వడం వంటివి టీడీపీ అధిష్టానం మదిలో ఉన్న అస్త్రాలుగా చెబుతున్నారు. గత ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వడంతో పాటు..కొందరిని పార్టీ పొలిట్ బ్యూరోలోకి.. మరికొందరిని జిల్లా పార్టీ అధ్యక్ష పగ్గాలు..ఇంకొందర్ని ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులుగా పంపించాలనేది బాబు ఆలోచనగా చెబుతున్నారు. సీట్ల సర్దుబాటు విషయంలో వచ్చే సవాళ్లను టీడీపీ అధిష్టానం ఇంకా ఎలా ఫేస్ చేయబోతోందో వేచి చూడాలి మరి.

## 74 అమల్లోకి కొత్త రైల్వే చార్జీలు

హైదరాబాద్, డిసెంబర్ 26,

భారతదేశంలో నేటి నుంచి రైల్వే టికెట్ల ధరల పెంపు అమలులోకి వస్తుంది. ఇటీవల రైల్వేశాఖ సుదూర ప్రయాణాలపై టికెట్ ఛార్జీలు పెంచడం తెలిసిందే. ఈ సవరించిన రైళ్ల ఛార్జీలు ఈరోజు (శుక్రవారం) అంటే డిసెంబర్ 26 నుంచి అమల్లోకి వచ్చాయి. దీని కోసం రైల్వే డిసెంబర్ 21న నోటిఫికేషన్ జారీ చేసింది.ప్రయాణికుల సౌకర్యం, నిర్వహణకు ఆర్థిక స్థిరత్వం మధ్య సమతుల్యత లక్ష్యంతో ప్రయాణీకుల ఛార్జీలలో హేతుబద్ధీకరణను ప్రకటించినట్లు రైల్వేశాఖ తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో, పెరిగిన ఛార్జీలు ఇప్పటికే బుక్ చేసుకున్న టిక్కెట్లకు కూడా వర్తిస్తాయా? డిసెంబర్ 26కు ముందు టిక్కెట్లు బుక్ చేసుకున్నవారు ప్రయాణ సమయంలో అదనంగా డబ్బు చెల్లించాలా అని ఆలోచిస్తున్నారా. రైల్వేశాఖ సమాచారం ప్రకారం, ఇటీవల సవరించిన ఛార్జీలు డిసెంబర్ 26 నుంచి అమలులోకి వచ్చేశాయి. ఇది ఈ తేదీ నుంచి బుక్ చేసుకున్న టిక్కెట్లకు మాత్రమే వర్తిస్తుంది. మీరు డిసెంబర్ 26కు ముందు టిక్కెట్ బుక్ చేసుకున్నట్లయితే, ఆ తర్వాత తేదీలలో ప్రయాణించాల్సి వచ్చినా, అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు.సీజన్ టిక్కెట్ల ఛార్జీలలో ఎటువంటి మార్పు చేయలేదని రైల్వేశాఖ స్పష్టం చేసింది. అంతేకాకుండా, సెకండ్ క్లాస్ సాధారణంలో 215 కిలోమీటర్ల వరకు ప్రయాణానికి సైతం ఎటువంటి ఛార్జీల పెరుగుదల లేదు.

నాన్-ఏసీ సాధారణ రైళ్లలో పెరిగిన ఛార్జీలు దూరం ఆధారంగా వర్తిస్తాయి. ఉదాహరణకు, మీరు 216 కిమీ నుండి 750 కిమీ ప్రయాణానికి ?5 పెరిగింది. 751 కిమీ నుండి 1250 కిమీ ప్రయాణానికి 10 రూపాయలు అదనంగా చెల్లించాలి. అదేవిధంగా, 1251 కిలోమీటర్ల నుంచి 1750 కిమీ ప్రయాణానికి 15 రూపాయలు, 1751 కిమీ నుండి 2250 కిమీ వరకు టిక్కెట్‌కు 20 రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. స్లీపర్ క్లాస్, జనరల్, ఫస్ట్ క్లాస్ ప్రయాణాలలో కిలోమీటరుకు 1 పైసా చొప్పున ఛార్జీలు పెరిగాయి.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్
website:www.scr.indianrailways.gov.in

**NOTICE INVITING e -TENDER (hrough http://www.ireps.gov.in)**

PUB/1671

భారత రాష్ట్రపతి తరపున చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్), దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు ఈ క్రింది పనులకు రెండు ప్యాకెట్ వ్యవస్థలో ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్రమ సంఖ్య :1. NIT నం : టెండర్ నెం.: 05-2025-2026-B-252-TRD పనిపేరు : డిజైన్, సరఫరా, నిర్మాణం యొక్క పరీక్ష మరియు కమీషన్ 25KV, 50HZ, సింగిల్ ఫేజ్ ఏసి ట్రాక్షన్ 65 చదరపు 65 చ.మి.మీ. విస్తీర్ణంలో ఉన్న ఓవర్ హెడ్ పరికరాలు క్యాటరనరీ వైర్ మరియు 107 చదరపు 107 చ.మి.మీ. HDG రాగి కాంటాక్ట్ వైర్, LT సరఫరా సహ ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్లు ఇప్పటికే ఉన్న OHEకి మార్పులు ప్రతిపాదిత బైపాస్‌తో కనెక్షన్ ముస్తాబాదా మధ్య RORతో లైన్ (MBD) మరియు రాయనపాడు (RYP) విజయవాడలో (బ్యాలెన్స్ వర్క్స్) దక్షిణ మధ్య రైల్వే విభాగం. అంచనా వ్యయం : రూ. 1,91,06,294, ఇఎండి : రూ.2,45,500. పూర్తిచేయు కాలం : 12 నెలలు, ముగింపు తేదీ మరియు సమయం : 09.01.2026న మధ్యాహ్నం 3.00 గంIలకు.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాల కోసం, దయచేసి https://www.ireps.gov.in వెబ్‌సైట్‌కి లాగిన్ అవ్వండి.
2. బిడ్ సెక్యూరిటీ/ఇఎండిని IREPSలో ఇ-పేమెంట్ గేట్‌వే ద్వారా నగదు రూపంలో డిపాజిట్ చేయాలి లేదా షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి FA&CAO/C/SC కి బ్యాంక్ గ్యారెంటీ బాండ్‌గా లేదా టెండర్ డాక్యుమెంట్లలో పేర్కొన్న విధంగా సమర్పించాలి. బ్యాంక్ గ్యారెంటీ బాండ్ అనుబంధం-VIA ప్రకారం ఉంటుంది మరియు బిడ్ చెల్లుబాటు వ్యవధి తర్వాత 90 రోజులపాటు చెల్లుబాటు అవుతుంది.
3. టెండర్‌దారులు తమ ఆఫర్లను టెండర్ సమర్పణ వ్యవధిలో, అంటే టెండర్ ముగింపుకు పదిహేను రోజుల వ్యవధిలో ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు.
4. టెండర్ దాఖలు చేసే సమయం ప్రారంభమయ్యే తేదీ వరకు టెండరర్ ఏదైనా కొరిజెండా (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడినది) కోసం గమనించాలి.

చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, కాంట్రాక్ట్, సికింద్రాబాద్

**Tender Notice No.: 52/2025 Dated : 26-12-2025. SUPPLY OF STORES ITEMS e-Procurement Tender Notice**

PUB/1672

క్రింది టెండర్లు ఆన్‌లైన్‌లో ఉన్నాయి. టెండర్ దారులు www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి వారి దరఖాస్తులను సమర్పించాలి. ఆన్‌లైన్‌లో ఆఫర్లు, టెండర్ వివరణ, ... లు వెబ్‌సైట్‌లో కనిపించవచ్చు. మాన్యువల్‌గా సమర్పించబడిన ఆఫర్‌లు అంగీకరించబడవు. పోస్ట్ ద్వారా ఆఫర్‌లు కూడా అంగీకరించబడవు. టెండర్ ముగింపు తేదీనాడు, 14.30 గంటల సమయం వరకు మాత్రమే. స్వదేశీ ఆఫర్లు, ఇఎండిలు మాత్రం www.ireps.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే అంగీకరించబడును.

| టెండర్ నెం.: | టెండర్ నెం.: |
|---|---|
| 30251301 | సైలెంట్ బ్లాక్ |
| 61251064C | డబుల్ సైడ్ ఓపెన్ చేయగల డోర్ క్లోజర్ ప్లా.నం.:61190019 |
| LH257181 | పూర్తి బోగీ ఫ్రేమ్ |
| 38245015 | అడాప్టర్ (ఇరుకైన దవడ) తరగతి 'E'6x11; |
| 30251263 | FRP లౌవ్రే షట్టర్ |
| 56255367 | SMPS ఆధారిత మినీ IPS వ్యవస్థ |
| LN255276B | LHB అండర్ ఫ్రేమ్ కోసం హెడ్ స్టాక్ CPL |
| LN259001D | ఐసిఎఫ్ ఎస్ఎస్ డస్ట్‌బిన్ |
| 6025PT036 | RDSO Drg.no.T-8822 ప్రకారం అన్ని ఫిట్టింగ్‌లతో కూడిన మందపాటి వెబ్ స్విచ్ ఎక్స్‌పాన్షన్ జాయింట్‌లు (TWSE) |
| 38255018 | AAR ఆమోదించబడిన కార్ట్రిడ్జ్ టేపర్డ్ రోలర్ బేరింగ్ క్లాస్ 'కె' |
| 56255370 | హై అవైలబిలిటీ సింగిల్ సెక్షన్ డిజిటల్ ఆక్సిల్ కౌంటర్ (HASSDAC) |
| 56255369 | రైల్ క్లా (MSDAC) కోసం వీల్ సెన్సార్ RSR 180 |

గమనిక : టెండర్ గడువు తేదీలు

తేదీ : 31.12.2025న క్రమ సంఖ్య : 1, తేదీ : 08.01.2026న క్రమ సంఖ్య : 2, తేదీ : 12.01.2026న క్రమ సంఖ్య : 3 & 4, తేదీ : 13.01.2026న క్రమ సంఖ్య : 5, తేదీ : 12.01.2026న క్రమ సంఖ్య : 9 నుండి 12 వరకు, తేదీ : 19.01.2026న క్రమ సంఖ్య : 13, తేదీ : 16.01.2026న క్రమ సంఖ్య : 6 నుండి 8 వరకు, తేదీ : 20.01.2026న క్రమ సంఖ్య : 9, తేదీ : 21.01.2026న క్రమ సంఖ్య : 10, తేదీ : 02.02.2026న క్రమ సంఖ్య : 11, తేదీ : 03.02.2026న క్రమ సంఖ్య : 12

పైన పేర్కొన్న టెండర్లతోపాటు రూ.50 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగిన ఇతర టెండర్లు కూడా వున్నాయి.

పూర్తి వివరాల కోసం దయచేసి పైనవున్న రైల్వే వెబ్‌సైట్‌ను సందర్శించండి.

ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్స్ మేనేజర్, సికింద్రాబాద్.

A2126

మరిన్ని టెండర్ నిబంధనలు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి,
**https://www.ireps.gov.in**
లేదా
**www.scr.indianrailways.gov.in**
వెబ్‌సైట్‌ను సందర్శించండి


## ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నవైకాపా నేతలు

విశాఖపట్నం డిసెంబర్ 25(భారత శక్తి):

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి పుట్టిన రోజు సందర్భం గా వైసిపి శ్రేణులు వేట కొడవళ్ల వంటి మారణాయుధాలతో ప్రదర్శ నలు చేస్తూ ప్రజలను భయబ్రాంతులకు గురిచేయడం శోచనీయమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీని వాసరావు అన్నారు. మారణాయు ధాలు పట్టుకుని బహిరంగంగా ప్రద ర్శనలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదమని, ఇటువంటి చర్యలపై ఆర్మ్స్ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, విజన్తో రాష్ట్రానికి పెట్టుబడిదారులు, ప్రము ఖ కంపెనీలు ఆకర్షితువు తున్నారని తెలిపారు. శాంతి, భద్రత, స్థిరమైన పాలన ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని చెప్పారు. పెట్టుబడిదా రులను భయపెట్టే కుట్రలో భాగంగా వైసిపి,జగన్ అనుయాయులు రాష్ట్రాన్ని అశాంతివైపు నెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ హింసాత్మ క రాజకీయ సంస్కృతిని తమ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబో దని చెప్పారు

## చెప్పు దెబ్బలు తిన్న కాంగ్రెస్ నేత

కామారెడ్డి డిసెంబర్ 26,

కామారెడ్డి జిల్లా బాన్సువాడలో కాంగ్రెస్ నాయకుడి అరాచకం బయట పడింది. కాంగ్రెస్ నాయకుడు ఏనుగు రవీందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు దేవేందర్ రెడ్డి ఒక వివాహితను నెల రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. దేవేందర్ రెడ్డి టార్చర్ను భరించలేక బాధితురాలు తన భర్తకు ఫిర్యాదు చేసింది. బాన్సువాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మహిళను వేధిస్తుండగా భర్త రెడ్ హ్యాండ్‌గా పట్టుకున్నాడు. ఆసుపత్రి నుండి నడిరోడ్డుపై చెప్పులతో కొడుతూ పోలీసులకు అప్పగించాడు. దీంతో పంచాయితీ బాన్సువాడ పోలీస్ స్టేషన్కు చేరింది. రంగంలోకి దిగిన కాంగ్రెస్ నేతలు బాధితురాలిని, ఆమె భర్తని బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు.

# ఇండియాలో కొత్తగా 3 విమానయాన సంస్థలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 25(భారత శక్తి):

ఇండిగో సంస్థ చేసిన నిర్వాకం వల్ల దేశంలో ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. దేశంలోని అన్ని విమానాశ్రయాలలో ప్రయాణికులు గంటల తరబడి పడికాపులు కాయాల్సి వచ్చింది. దీంతో భారత్ పరువు పోయింది. ఫలితంగా భారత ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంది. ప్రతిపక్షాల



అయితే కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాయి. ఒకానొక దశలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చిందిఇండిగో సంస్థ ఇచ్చిన షాక్ నుంచి కేంద్ర ప్రభుత్వం త్వరగానే మేల్కొంది. నేపథ్యంలో దేశంలో మరో రెండు విమాన సంస్థలకు పౌర విమానయాన శాఖ అనుమతులు ఇచ్చింది. ఆల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్ ప్రెస్ సంస్థలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. పౌర విమానయాన శాఖ నుంచి ఈ సంస్థలకు నిరభ్యంతర పత్రాలు కూడా మంజూరయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో సంస్థ శంక్ ఎయిర్ అనే సంస్థకు కూడా ఇప్పటికే కేంద్రం నిరంతర పత్రం ఇచ్చింది. వచ్చేయడాల నుంచి ఆ సంస్థ కార్యకలాపాలు మొదలు పెట్టనుంది.ఇటీవల దేశీయ ఇండిగో సంస్థలో సంక్షోభం ఏర్పడింది. దీంతో దేశవ్యాప్తంగా కొద్ది రోజులపాటు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో అనేకమంది ప్రయాణికులు విమానాశ్రయాలలో చిక్కుకుపోయారు. ఈ వ్యవహారంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్లో సుదీర్ఘంగా ప్రసంగించారు. విమానయాన రంగంలో ఏ సంస్థ పూర్తి స్థాయిలో ఆధిపత్యం కొనసాగించడానికి తాను ఆస్కారం ఇవ్వడం లేదని.. ఇంకా చాలా సంస్థలను ఈ రంగంలోకి ఆహ్వానిస్తున్నట్టు ప్రకటించారు. అంతేకాదు కొత్త సంస్థలు కార్యకలాపాలు సాగించడానికి ఇదే అనుకూలమైన సందర్భం అని ఆయన పేర్కొన్నారు. ఇక మన దేశంలోని విమానయాన రంగంలో ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు 90% వాటా కలిగి ఉన్నాయి. ఇందులో ఇండిగో కే 65% వాటా ఉండడం విశేషం.కేంద్రం తీసుకొచ్చిన నిబంధనల నేపథ్యంలో ఇండిగో సంస్థ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సర్వీసులను అప్పటికప్పుడు రద్దు చేసింది. కొన్ని సర్వీస్లను దారి మళ్ళించింది. దీంతో దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాలలో ప్రయాణికులు నరకం చూశారు. సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు విమానాశ్రయాలకే పరిమితం కావలసి వచ్చింది. ఈ పరిణామం నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర నిర్ణయం పట్ల ప్రయాణికులనుంచి సానుకూల స్పందన వ్యక్తం అవుతుంది. ఈ నిర్ణయం ఎప్పుడో తీసుకొని ఉంటే బాగుండేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు.. సంక్షేమ పథకాలు

## 37 వేల మందికి కట్..

హైదరాబాద్, డిసెంబర్ 25(భారత శక్తి):

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అనర్హులను గుర్తించి తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.ముఖ్యంగా పేదలకు ఉద్దేశించిన పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా మారిన విషయం ఉన్నతాధికారుల పరిశీలనలో బయటపడింది. అర్హత లేని వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.ఇదే క్రమంలో మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని రేవంత్ సర్కార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పేదలకు అందించే పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది..ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు తీసుకుంటున్న కొంతమంది ఉద్యోగులు నిరుపేదలకు అందాల్సిన పింఛన్లు, ఇండ్లు, చివరకు ఉపాధి హామీ కూలీ డబ్బులను కూడా పొందుతున్నట్టు అధికారిక లెక్కల్లో తేలింది. దీనికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన నివేదిక ప్రకారం.. దాదాపు 37 వేల మందికి పైగా ఉద్యోగులు వివిధ పథకాల్లో లబ్ది పొందుతున్నట్టు బయటపడింది. వీరిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఈ జాబితాలో చిరుద్యోగులే కాదు.. ఉన్నత స్థాయి ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చాయనేది ఇప్పుడు చర్చనీయాం శంగా మారింది.ప్రభుత్వం పేదలకోసం అందిస్తున్న పథకాల్లో ఏఏ పథకంలో ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.. వారిలో ఎంతమంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఎంత మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారనే వివరాలను ఉన్నతాధికారులు ఇప్పటికే సేకరించారు. ఆ డేటా ఆధారంగా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్, మినిమమ్ టైమ్ స్కేల్, స్టేట్ స్కల్ కింద జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను తక్షణమే నిలిపివేయాలని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. వీరు నిబంధనల ప్రకారం అనర్హులని తేల్చిచెప్పారు.పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు(47), ఎస్‌జీటీ అండ్ టీజీటీలు (71), పబ్లిక్ హెల్త్ మేనేజర్లు, లెక్చరర్లు, చివరకు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు(5), జ్యుడీషియల్ మెజిస్ట్రేట్లు కూడా జాబితాలో ఉండడం గమనార్హం. వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఉద్యోగులందరి ఆధార్ డేటా తీసుకున్న ప్రభుత్వం.. వాటిని ప్రభుత్వ పథకాలతో సరిపోల్చింది. దీంతో ఈ లెక్కలు బయటపడ్డాయి. ఇంకొన్ని స్కీములలో కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని సెక్రటేరియెట్? వర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పథకంలోనే అత్యధికంగా ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారు. అధికారుల నివేదిక ప్రకారం.. ఈ ఒక్క పథకంలోనే ఏకంగా 15,704 మంది ఉద్యోగుల వివరాలు లబ్ధిదారుల జాబితాతో సరిపోలాయి. వీరిలో అత్యధికంగా 8,273 మంది గౌరవ వేతనం తీసుకుంటున్న చిరుద్యోగులు ఉండగా, 3,202 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, 2,939 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. విచిత్రమేమిటంటే.. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి జీతాలు తీసుకునే స్టేట్ స్కేల్ రెగ్యులర్ ఉద్యోగులు 478 మంది, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు 338 మంది కూడా ఈ పథకం కింద డబ్బులు తీసుకుంటున్నట్టు తేలింది. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, జూనియర్ లెక్చరర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల వంటి అనేక రకాల ఉద్యోగులు ఉన్నారు. గ్రామాల్లో పనులు దొరక్క ఇబ్బంది పడే కూలీల కోసం ఉద్దేశించిన ఉపాధి హామీ పథకంలోనూ11,210 మంది ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధి పొందుతున్నట్టు గుర్తించారు. ఇందులో సింహభాగం 7,077 మంది గౌరవ వేతనం తీసుకునే సిబ్బంది ఉన్నారు. అలాగే 2,214 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 1,124 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉపాధి హామీ డబ్బులు పొందుతున్నారు. ఆశ్చర్యకరంగా.. 351 మంది రెగ్యులర్ ఉద్యోగులు కూడా ఉపాధి హామీ కూలీ డబ్బులు తీసుకున్నవారి జాబితాలో ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల పథకంలోనూ ఉద్యోగులు భారీగానే లబ్ధి పొందారు. మొత్తం 9,135 మంది ఉద్యోగులు ఇండ్లు పొందినట్టు లేదా మంజూరు చేయించుకున్నట్టు డేటాలో తేలింది. వీరిలో 5,177 మంది హానరోరియం సిబ్బంది కాగా, 2,256 మంది కాంట్రాక్ట్, 1,371 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఇక 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద 1,444 మంది ఉద్యోగులు లబ్ధి పొందుతుండగా, వారిలోనూ హానరోరియం (954), కాంట్రాక్ట్(328) సిబ్బందే అధికంగా ఉన్నారు. డేటా ఆధారంగా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్, మినిమమ్ టైమ్ స్కేల్, స్టేట్ స్కేల్ కింద జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను "తక్షణమే నిలిపివేయాలి" అని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. వీరు నిబంధనల ప్రకారం అనర్హులని తేల్చిచెప్పారు. అయితే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సర్వీసులు, డైలీ వేజ్, హానరోరియం (గౌరవ వేతనం) తీసుకునే సిబ్బంది విషయంలో ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఆదాయ పరిమితి ఆధారంగా ఇస్తున్నందున.. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా అనర్హులుగా పరిగణించాలా? లేదా? అనే అంశంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుంది. ఒకవేళ సర్కారు కఠిన నిర్ణయం తీసుకుంటే మాత్రం.. దాదాపు 37 వేల మంది ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలన్నీ నిలిచిపోనున్నాయి

# హత్య ముందు నన్ను కలిశాడు

న్యూఢిల్లీ,డిసెంబర్ 25(భారత శక్తి):

: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ.. తరచూ సంచలన వ్యాఖ్యలతో అందరినీ ఆశ్చర్యపరుస్తుంటారు. ఇటీవలే టోల్‌గేట్స్ విషయంలో 2026 నుంచి కొత్త విధానం అందుబాటులోకి రాబోతోందని వెల్లడించారు. తాజాగా హమాస్ చీఫ్‌కు సంబంధించి బాంబు పేల్చారు. ఏడాదిన్నర క్రితం తాను హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియాను కలిశానని ప్రకటించారు. హనియా హత్యకు కొన్ని గంటల ముందే ఇద్దరం భేటీ అయినట్లు వెల్లడించాడు. ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణస్వీకారానికి భారత ప్రతినిధిగా వెళ్లానని, ప్రధాని మోదీ సూచనల మేరకు 2024లో జరిగిన ఈ కార్యక్రమంలో పలు దేశాల నాయకులతో అనధికారిక చర్చలు జరిగాయి. ఈ సమావేశాల్లో హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హనియా కూడా పాల్గొన్నట్లు వెల్లడించారు. ప్రమాణస్వీకారం తర్వాత అధ్యక్షుడు, చీఫ్ జస్టిస్‌తో కలిసి హనియాను చూశారని తెలిపారు.కార్యక్రమం ముగిసిన తర్వాత గడ్కరీ ఓహోటల్‌లో విశ్రాంతి తీసుకున్నారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇరాన్ రాయబారి త్వరగా వెళ్లాలని సూచించారు. హమాస్ చీఫ్ హత్యకు గురయ్యారని తెలిపినప్పుడు ఆశ్చర్యపోయినట్లు వెల్లడించారు. ఈ సంఘటన కొన్ని గంటల ముందే జరిగిన కలయికను గుర్తుచేస్తూ, ప్రపంచ రాజకీయాల్లో భారత్ పాత్రను ప్రస్తావించారు.2024 జూలై 31న టెహ్రాన్‌లోని గెస్ట్ హౌస్‌పై ఇజ్రాయెల్ క్షిపణి దాడి జరిగింది. ఈ దాడిలో హనియా, ఆయన రక్షణాధికారి మరణించారు. ఇజ్రాయెల్?హమాస్ సంఘర్షణ సమయంలో ఈ ఘటన జరగడం ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేసింది. ఇరాన్ భూభాగంలో జరిగిన ఈ ఆపరేషన్ అంతర్జాతీయ చట్టాలను సవాలు చేసినట్టు విమర్శలు వచ్చాయి. అయితే గడ్కరీ అనుభవం భారత్ మధ్యప్రాంతీయ దేశాల మధ్య సమతుల్య సంబంధాలను సూచిస్తుంది. ఇరాన్‌తో దౌత్య సంబంధాలు, ఇజ్రాయెల్‌తో రక్షణ సహకారం ఉన్న భారత్‌కు ఇలాంటి సందర్భాల్లో కీలక పాత్ర ఇది. ఈ ఘటన ప్రపంచవ్యాప్త ఉద్రిక్తతలను పెంచినప్పటికీ, భారత్ శాంతి చర్చలకు మద్దతు ఇచ్చే స్థానంలో ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.హత్య హమాస్?ఇజ్రాయెల్ ఘర్షణకు కొత్త దశను తీసుకొచ్చింది. ఇరాన్ ప్రతీకార చర్యలు, ప్రాంతీయ మిత్రదేశాల స్పందనలు భవిష్యత్ ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉంది. గడ్కరీ వెల్లడి దౌత్య వ్యూహాల గురించి కొత్త చర్చలకు దారితీసింది.

# సవాళ్లు, ప్రతి సవాళ్లు...

## ఇకపై ఫుల్ యాక్టీవ్‌గా పాలిటిక్స్

మెదక్, డిసెంబర్ 25(భారత శక్తి):

ఇప్పటిదాక ఒక లెక్క. ఇక నుంచి మరో లెక్క. అడ్డగోలుగా మాట్లాడుతామ్. నోటికొచ్చినట్లు వాగుతామ్ అంటే కుదరదు. ప్రజాక్షేత్రంలోకి లాగుతాం. మీ సంగతేంటో చూస్తామని..కాంగ్రెస్ సర్కార్‌కు వార్నింగ్ ఇచ్చారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. కాంగ్రెస్ సర్కార్‌కు కావాల్సిన టైమ్ ఇచ్చామని..ఇక పోరు బాటే అంటూ యుద్ధం ప్రకటించారు. దాదాపు రెండేళ్ల పాటు ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన గులాబీ బాస్ ఇకపై ఫుల్ యాక్టీవ్‌గా పాలిటిక్స్‌లో ఉంటానని చెప్పుకొచ్చారు.రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు సంసిద్ధం అవుతున్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌ను ఎంచుకున్నారు కేసీఆర్. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కృష్ణా జలాలను ఏపీకి తరలించే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తున్న కేసీఆర్..ఆందోళనలు, సభలు, సమావేశాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.కాంగ్రెస్ పాలన తెలంగాణకు శాపంగా మారిందని కేసీఆర్ శాపనార్థాలు పెట్టడం, హస్తం పార్టీ సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించి ఇకపై ప్రజల్లోకి వెళ్తామని యుద్ధం ప్రకటించడంతో రాజకీయం వేడెక్కింది. రెండేళ్లుగా స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ క్యాడర్‌లో కేసీఆర్ రాక ఉత్సాహాన్ని నింపింది. ఇక పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆశించిన దాని కంటే మెరుగైన ఫలితాలు రావడంతో..ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో ఇంకా సత్తా చాటొచ్చన్న నమ్మకం పెరిగింది.కేసీఆర్ చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం మధ్య డైలాగ్‌వార్‌కు దారితీశాయి. బీఆర్ఎస్, కేసీఆర్ చరిత్ర ఇక ముగిసిన కథే అంటున్నారు సీఎం రేవంత్. తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్ కుటుంబం అధికారంలోకి రాదని, రానివ్వబోనని కొడంగల్ సాక్షిగా శపథం చేశారు. 2029 ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 80 సీట్లు, 153 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 100కుపైగా సీట్లు గెలుచుకుంటాం..ఇది తన సవాల్ రాసిపెట్టుకోండి అంటూ గర్జించారు రేవంత్.అందుకు అనుగుణంగానే కేసీఆర్‌తో పాటు గులాబీ పార్టీ నేతల దూకుడుకు బ్రేకులు వేసేలా పథకం రచిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ పాలనలో స్కామ్‌లు జరిగాయంటూ కేసులు, విచారణలను స్పీడప్ చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ ఆఫీసర్లు కేసీఆర్ సహా కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల తర్వాత జనంలోకి వచ్చేందుకు రెడీ అవుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఇది ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది.కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించిన కేసీఆర్‌కు.. సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసుతో బ్రేకులు వేయబోతున్నారన్న చర్చ సాగుతోంది. అంతే కాకుండా ఈ నెల 29 నుంచి ప్రారంభవుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నదీజలాలు, ప్రాజెక్టుల అంశం ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. కృష్ణా జలాలపై బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీతో కుదుర్చుకున్న ఒప్పందం తెలంగాణకు శాపంగా మారిందని చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్, ఫార్ములా ఈ కారు రేస్ వంటి అంశాలను సభలో ప్రస్తావనకు తెచ్చేందుకు రేవంత్ సర్కార్ ప్లాన్ చేస్తోందట.కేసీఆర్‌కు నోటీసులు కొత్త కాదని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగిపోవడంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరై డీటేయిల్డ్‌గా సమాధానం ఇచ్చిన విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు బీఆర్ఎస్ నేతలు. ఒకవేళ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇస్తే ఆయన విచారణకు హాజరవుతారా లేదా అన్న అంశంపై ఇంకా స్పష్టత లేదంటున్నాయి పార్టీ వర్గాలు. ఫార్ములా ఈ కారు రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండుసార్లు ఏసీబీ విచారణకు హాజరయ్యారు.కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడంతో అరెస్ట్ తప్పదన్న ప్రచారం జరుగుతోంది. ఇదంతా రాజకీయ కక్ష సాధింపు చర్య అన్నది కారు పార్టీ నేతల వాదన. కేసులు విచారణలు తమను చికాకు పెడుతున్నాయన్న అసహనం బీఆర్ఎస్ వర్గాల్లో కనిపిస్తోంది. కొత్త సంవత్సరంలో ప్రజల్లోకి వెళ్లాలనుకున్న గులాబీ దళపతి కేసీఆర్ దూకుడుకు..బ్రేకులు వేసేందుకు రేవంత్ పక్కా స్కెచ్ రెడీ చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రేవంత్ గేమ్‌కు కేసీఆర్ దగ్గరున్న ప్లాన్ ఏంటో చూడాలి మరి.

# అవినీతిలో అగ్రస్థానం

## రెవెన్యూ, ఇరిగేషన్ లదే

హైదరాబాద్, డిసెంబర్ 25(భారత శక్తి):

తెలంగాణలో అవినీతి తిమింగలాల వేటలో ఏసీబీ అధికారులు ఈ ఏడాది దూకుడు పెంచారు. 2025లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 220 కంటే ఎక్కువ కేసులు నమోదు కాగా.. సుమారు 190 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు అరెస్ట్ చేశారు. ముఖ్యంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల్లోనే లంచం కేసులు ఎక్కువగా వెలుగుచూశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో దాదాపు రూ. 58 కోట్ల విలువైన డాక్యుమెంట్లను సీజ్ చేయగా.. వీటి బహిరంగ మార్కెట్ విలువ రూ. 500 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. లంచం అడిగే అధికారుల సమాచారాన్ని 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.తెలంగాణలో అవినీతికి వ్యతిరేకంగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తన పోరాటాన్ని ఉధృతం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యులను ఇబ్బంది పెడుతూ లంచాలకు అలవాటు పడిన అధికారుల భరతం పట్టడంలో అధికారులు ఈ ఏడాది సరికొత్త రికార్డులను సృష్టించారు. 2025 సంవత్సరం ప్రారంభం నుండి ఇప్పటివరకు తెలంగాణ వ్యాప్తంగా ఏసీబీ అధికారులు 220 కంటే ఎక్కువ కేసులు నమోదు చేశారు. ఇది గత ఏడాదితో పోలిస్తే భారీ పెరుగుదల.ఈ కేసులలో భాగంగా దాదాపు 150 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగులను అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. పట్టుబడిన కేసులలో అధిక శాతం లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయినవే. 2024లో మొత్తం 152 కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఆ సంఖ్య ఇప్పటికే 220 దాటిపోయింది. అంటే దాదాపు 100 కేసులు అదనంగా నమోదయ్యాయి.ఈ ఏడాది దాడులలో కొన్ని శాఖలకు చెందిన అధికారులు అక్రమ సంపాదనలో రికార్డులు సృష్టించారు. నీటి పారుదల శాఖ, రెవెన్యూ విభాగాల్లో అత్యధికంగా లంచం కేసులు వెలుగుచూశాయి. భూముల వ్యవహారాలు, ప్రాజెక్టుల బిల్లుల క్లియరెన్స్ కోసం సామాన్యులను వేధించిన అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. ఇటీవల రవాణా శాఖలో జరిగిన సోదాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఒకే అధికారి వద్ద వందల కోట్ల అక్రమాస్తులు బయటపడటం అధికారులనే విస్మయానికి గురిచేసింది. కేవలం లంచం మాత్రమే కాకుండా.. అక్రమంగా కోట్లు కూడబెట్టిన 17 మంది పైగా ఉన్నతాధికారులపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదయ్యాయి. వీరి నుండి కేజీల కొద్దీ బంగారం, భారీగా నగదు, స్థిర ఆస్తులను ఏసీబీ సీజ్ చేసింది.అవినీతి రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఫిర్యాదులను స్వీకరించడానికి వాట్సాప్,టోల్ ఫ్రీ నంబర్లను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల బాధితులు భయం లేకుండా ముందుకు వస్తున్నారు. లంచగొండి అధికారులను అరెస్ట్ చేయడమే కాకుండా.. వారిని సర్వీసు నుండి తొలగించేలా.. వారి ఆస్తులను జప్తు చేసేలా చట్టపరమైన చర్యలను వేగవంతం చేశారు.ఏదైనా ప్రభుత్వ పని కోసం అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. లంచం ఇవ్వడం కూడా నేరమేనని.. అందుకే వ్యవస్థను ప్రక్షాళన చేయడంలో ప్రజలు సహకరించాలని కోరుతున్నారు. ఏసీబీ చేపట్టిన ఈ మెరుపు దాడులతో ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల్లోని అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

# వరుస కష్టాలతో గులాబీలు

హైదరాబాద్, డిసెంబర్ 25(భారత శక్తి):

అధికారం కోల్పోయినప్పటి నుంచి వరుసపెట్టి ట్రబుల్స్ ఫేస్ చేస్తోంది బీఆర్ఎస్. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, చేసిన పనులపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణల జరుపుతుండటం గులాబీ పార్టీని ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించిన రేవంత్ సర్కార్.. ఆ నివేధిక ఆధారంగా సీబీఐ విచారణకు ఆదేశించింది. దీంతో సీబీఐ దర్యాప్తు ఎలాంటి టర్న్ తీసుకుంటుందోనన్న సస్పెన్స్ కంటిన్యూ అవుతోంది.ఇక గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోని ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ ఒప్పందాలు, గొర్రెల పంపిణీ స్కీమ్, ఫార్ములా ఈ కార్ రేసింగ్ అంశాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ సర్కార్.. వీటన్నింటిపైనా విచారణ జరిపిస్తోంది. ఇందులో భాగంగా ఈ కార్ రేస్ వ్యవహారంపై కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతిచ్చింది. ఈ కార్ రేస్ కేసులో మరోసారి కేటీఆర్‌ను విచారణకు పిలిచి అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ కేసు ఎటువైపు దారితీస్తుందన్న ఆందోళన బీఆర్ఎస్ వర్గాల్లో నెలకొందిఇక బీఆర్ఎస్ పార్టీలో పలు అంశాలు వివాదాస్పదం అవుతున్నాయి. ముఖ్యంగా కవిత వ్యవహారం కారు పార్టీకి కంట్లో నలుసులా మారిందనే చెప్పొచ్చు. పార్టీ నుంచి సస్పెండ్ చేసినప్పటి నుంచి..వాయిస్ మరింత పెంచారు కవిత. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, నేతలపై అవినీతి ఆరోపణలు, విమర్శలు చేస్తూ..అధికార పార్టీకి అస్త్రాలను అందిస్తుంది. ఇలాంటి ఎన్నో తలనొప్పులు ఉన్న టైమ్‌లో మరోసారి ఫోన్ ట్యాపింగ్ కేసు తెరపైకి రావడం ఆసక్తిరేపుతోందిఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు విచారణను స్పీడప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతులిచ్చే రివ్యూ కమిటీలోని ఉన్నతాధికారులు, మాజీ ఇంటెలిజెన్స్ అధికారులను ఇప్పటికే ప్రశ్నించి వారి వాంగ్మూలాన్ని సిట్ అధికారులు నమోదు చేశారు. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్ రావుకు నోటీసులు ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ సమావేశాల తర్వాత సిట్ నోటీసులు జారీ చేసి ఆ తర్వాత విచారణకు పిలిచే ఛాన్స్ ఉందని అంటున్నారు. దీంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ఉలిక్కిపడేలా చేస్తోంది.

ఇప్పటికే పదుల సంఖ్యలో సమస్యలతో డైలమాలో ఉన్న గులాబీ పార్టీకి ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసు, నోటీసులు అంటూ జరుగుతున్న ప్రచారంతో మరింత ఆందోళనకు గురవుతోందట. ఇలా వరుస కేసులు, విచారణలతో పాటు పార్టీలో అంతర్గతంగా నెలకొన్న పరిస్థితుల పట్ల బీఆర్ఎస్ లీడర్లు, క్యాడర్ నైరాశ్యంలో కూరుకుపోతున్నారన్న చర్చ జరుగుతోంది. పైకి ఇవన్నీ కామనే అని కీలక నేతలు చెబుతున్నా.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని పార్టీ కార్యకర్తలు మాత్రం కంగారు పడుతున్నారన్న టాక్ వినిపిస్తోంది.

# సెలవుల్లో ఉద్యోగులు... ఆఫీసుల ముందు ప్రజలు

వరంగల్, డిసెంబర్ 25(భారత శక్తి):

పండుగొచ్చిందంటే చాలు.. రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. పండుగకు ముందు, తర్వాత రోజు అధికారులు, సిబ్బంది సెలవు పెట్టి వెళ్తున్నారు. పండుగ సెలవు ఒక్కరోజే ఉన్నప్పటికీ, ఆఫీసులు మాత్రం రెండు, మూడు రోజుల పాటు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సెక్రటేరియెట్ మొదలుకుని మండల ఆఫీసుల దాకా ఇదే పరిస్థితి నెలకొన్నది. పండుగ మూడ్‌లో ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే ప్రజలు అధికారుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. సెక్రటేరియెట్‌లో ఫ్లోర్‌కు ఒక సెక్రటరీ అన్నట్టుగా ఐదుగురు కంటే ఎక్కువ మంది కనిపించలేదు. సీఎం రేవంత్ రెడ్డి ఐఏఎస్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి.. విధుల్లో అలసత్వం వహించవద్దని, ప్రజలకు అందుబాటులో ఉండాలని హెచ్చరించారు. కానీ మరుసటి రోజే చాలామంది ఉన్నతాధికారులు విధులకు డుమ్మా కొట్టారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీలు వంటి అధికారులే తమ చాంబర్లలో కనిపించలేదు. మధ్యాహ్నం 3 గంటలకు సెక్రటేరియెట్‌లో ఐదుగురు సెక్రటరీలు మాత్రమే అందుబాటులో ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇక చీఫ్ మినిస్టర్ ఆఫీసు (సీఎంవో)లోనూ ఇదే తీరు కనిపిస్తున్నది. అక్కడ ఉండే కీలకమైన కార్యదర్శులు ఆఫీసుకు ఎప్పుడు వస్తారో? ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. సీఎంతో బ్రీఫింగ్ ఉన్న సమయంలో వాళ్లు ఎలాగూ ప్రజలకు అందుబాటులో ఉండరు. కానీ మిగతా సమయాల్లో, సీఎం జిల్లాల పర్యటనకు వెళ్లిన టైమ్‌లోనూ వాళ్లు చాంబర్లలో ఉంటలేరు. ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ఓఎస్డీ శ్రీనివాసులు మినహా మిగతా సెక్రటరీలు ఉన్నారా?లేరా? అన్నది తెలియడం లేదు. అసలు వీరు ఎవరిని కలుస్తున్నారు? ఎక్కడ ఉంటున్నారు? అన్నది అంతుచిక్కడం లేదు. ఐఏఎస్ అధికారులే ఉంటలేరని సాకుగా చూపిస్తూ అదనపు సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, అసిస్టెంట్ సెక్రటరీల నుంచి మొదలుకొని సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల వరకు అందరూ ఇదే బాటలో పయనిస్తున్నారు. సెక్రటేరియెట్ లెక్కనే జిల్లా, మండల కార్యాలయాల్లోనూ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీ రాజ్ వంటి కీలక శాఖల అధికారులు ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయాలకు రావడం లేదు. వచ్చినా కాసేపటికే మీటింగ్ ఉందంటూ బయటకు వెళ్లిపోతున్నారు. సామాన్య ప్రజలు ఎక్కువగా వెళ్లేది మండల కార్యాలయాలకే. కానీ అక్కడ పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీసుల్లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పండుగ వచ్చిందంటే చాలు.. ఈ కార్యాలయాల్లో సగం మంది సిబ్బంది సెలవు పెట్టకుండానే డుమ్మా కొడుతున్నారు. దీంతో కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం, భూసమస్యల పరిష్కారం, ఇతరత్రా పనుల మీద వచ్చే జిల్లా, మండల కేంద్రాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ పనిదినాల్లో సైతం అధికారులు, ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10:30 గంటలకు కార్యాలయాల్లో ఉండాల్సిన సిబ్బంది.. మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా రావడం లేదు. తీరా 12 గంటలకు ఆఫీసులకు చేరుకున్నా, గంట సేపు కూడా పని చేయకుండానే లంచ్ బ్రేక్ పేరుతో బయటకు వెళ్లిపోతున్నారు. తిరిగి సీట్లలోకి వచ్చేసరికి మధ్యాహ్నం 3 గంటలు దాటుతోంది. మళ్లీ సాయంత్రం 4 గంటలు అయిందంటే చాలు, బ్యాగులు సర్దుకుని ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండో శనివారం మాత్రమే సెలవు. కానీ వారాంతం వచ్చిందంటే చాలు యంత్రాంగం మొత్తం రిలాక్స్ మూడ్‌లోకి వెళ్లిపోతున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచే సొంత పనుల మీద, ఊర్ల ప్రయాణాల మీద దృష్టి సారించే అధికారులు.. శనివారం కార్యాలయాల్లో సంతకం పెట్టి వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం తర్వాత ఏ ప్రభుత్వ ఆఫీసులో చూసినా పట్టుమని పదిమంది ఉద్యోగులు కూడా కనిపించని దుస్థితి నెలకొంది.

# 6.5 కోట్లతో అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్ ట్రాక్

కరీంనగర్, డిసెంబర్ 25(భారత శక్తి):

ఉత్తర తెలంగాణ క్రీడాకారుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతో జమ్మికుంటలో రూ. 6.5 కోట్లతో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్రం అనుమతులు మంజూరు చేసింది. 'ఖేలో ఇండియా' పథకం కింద నిర్మించనున్న ఈ ట్రాక్, గ్రామీణ క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ అవకాశాలను అందించి, ఉత్తర తెలంగాణను క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దనుందిఉత్తర తెలంగాణలోని క్రీడాకారుల చిరకాల స్వప్నం నెరవేరబోతోంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ, కేంద్ర ప్రభుత్వ సానుకూల నిర్ణయంతో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో అత్యాధునిక సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లుగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో భాగంగా.. 'ఖేలో ఇండియా' పథకం కింద ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ రూ. 6.5 కోట్లు కేటాయిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ అధునాతన ట్రాక్‌ను నిర్మించనున్నారు. వరల్డ్ అథ్లెటిక్స్ నిర్దేశించిన అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 400 మీటర్ల పొడవు, 4 లైన్లతో ఈ సింథటిక్ ట్రాక్ రూపుదిద్దుకోనుంది. సాధారణంగా మట్టి ట్రాక్‌లపై శిక్షణ పొందే గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లినప్పుడు అక్కడి సింథటిక్ ట్రాక్‌ల స్వభావాన్ని అర్థం చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారు. ఇప్పుడు జమ్మికుంటలోనే ఇటువంటి సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల, క్రీడాకారులు తమ సొంత ప్రాంతంలోనే ప్రపంచ స్థాయి ప్రమాణాలతో శిక్షణ పొందే అవకాశం లభిస్తుంది. ఈ ప్రాజెక్టు కేవలం జమ్మికుంటకే పరిమితం కాకుండా కరీంనగర్, హన్మకొండ, జగిత్యాల మరియు పెద్దపల్లి జిల్లాల సరిహద్దుల్లోని వేలాది మంది క్రీడాకారులకు వరం కానుంది. సింథటిక్ ట్రాక్‌తో పాటు లాంగ్ జంప్, హై జంప్ వంటి ఇతర అథ్లెటిక్స్ క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా ఇక్కడ అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

ఈ ట్రాక్ నిర్మాణంపై బండి సంజయ్ హర్షం వ్యక్తం చేస్తూ, ఈ నిధులను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వ 'ఖేలో ఇండియా' పథకం ఉద్దేశ్యం క్రీడలను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లడం. జమ్మికుంట వంటి ప్రాంతంలో ఇలాంటి ప్రాజెక్టు రావడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. త్వరలోనే ఈ ట్రాక్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి, ఏడాది లోపే క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ఆధునిక ట్రాక్ అందుబాటులోకి వస్తే, ఉత్తర తెలంగాణ భవిష్యత్తులో దేశానికి మేటి అథ్లెట్లను అందించే క్రీడా కేంద్రంగా అవతరించడం ఖాయం.

# ఆరావళి కథ..ఇంకా ఉంది

న్యూఢిల్లీ, డిసెంబర్ 25(భారత శక్తి):

ఢిల్లీ ప్రాంతం కాలుష్యంతో అతలాకుతలం అవుతోంది. ఆ ప్రాంతం కాస్తలో కాస్త ఊపిరి పీల్చుకుంటుంది అంటే దానికి ప్రధాన కారణం ఆరావళి పర్వతాలే. అటువంటి విశిష్టత ఉన్న పర్వతాలలో మైనింగ్ కు అనుమతులు మంజూరు చేయడం పట్ల తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలో కేంద్ర పర్యావరణ శాఖ బుధవారం స్పందించింది. ఈ పర్వత శ్రేణిలో కొత్త మైనింగ్ లీజు లను మంజూరు చేయడం పట్ల నిషేధం విధించింది. ఇకపై ఈ ప్రాంతంలో ఎటువంటి మైనింగ్ జరగదని కేంద్ర పర్యావరణ శాఖ ప్రకటించింది. బయోడైవర్సిటీని పరిరక్షించడంలో ఈ పర్వత ప్రాంతాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని.. వాటి సంరక్షణకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని వెల్లడించింది. పురాతన ప్రాంతాలుగా పేరుపొందిన ఆరావళి పర్వతశ్రేణిలో మైనింగ్ కు సంబంధించి ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్త నిర్వచనాన్ని ప్రతిపాదించింది. దీనిని వ్యతిరేకిస్తూ చాలామంది పర్యావరణ ప్రేమికులు సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. దీనికి సంబంధించి గత నెల 20న కీలకమైన తీర్పును వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం నిర్వచించిన విధానం ప్రకారం ఈ పర్వత శ్రేణులు విస్తరించి ఉన్న ప్రాంతాలలో స్థానికంగా ఉన్న భూమట్టం నుంచి 100 మీటర్లు (328 అడుగులు) లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న ప్రాంతాలను మాత్రమే ఆరావళి పర్వతాలుగా పేర్కొంటారు. ఇక్కడ మైనింగ్ చేయడం దాదాపుగా నిషేధం. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తున ప్రాంతాన్ని ఆరావళి పర్వతశ్రేణిగా గుర్తించరు. ఈ ప్రాంతాలలో మైనింగ్ చేయడానికి అవకాశం ఉంటుంది. అయితే ఈ నిబంధన పై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అయింది.. చివరికి ప్రధానమంత్రి సొంత రాష్ట్రమైన గుజరాత్ లో కూడా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ పర్వత శ్రేణిలలో దాదాపు 91 శాతం పర్వతాలు 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులోనే ఉన్నాయి. అందువల్లే పర్యావరణవేత్తలు ఆందోళనకు దిగారు. ఇక్కడ తవ్వకాలు గనక జరిగితే ఆ పర్వతాలు మొత్తం నామరూపాలు లేకుండా పోతాయని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యమం అంతకంతకూ విస్తరిస్తున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. వెంటనే ఆ నిబంధనను వెనక్కి తీసుకుంది. అంతేకాదు, మైనింగ్ పై పూర్తిస్థాయిలో నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించింది.

# ల్యాబ్ టెక్నిషియన్ల పోస్టులలో నకిలీలు

హైదరాబాద్, డిసెంబర్ 25(భారత శక్తి):

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు చేపట్టిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ల ద్వారా అనర్హులు వెయిటేజీ మార్కులు పొంది, అర్హులైన అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ 11న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 100 మార్కులలో 80 మార్కులు రాత పరీక్షకు.. మిగిలిన 20 మార్కులు ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారికి వెయిటేజీగా కేటాయించారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రతి ఆరు నెలలకు 2.5 పాయింట్లు, ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారికి 2 పాయింట్ల చొప్పున గరిష్టంగా 20 పాయింట్లు ఇస్తారు. అభ్యర్థి గతంలో ఖచ్చితంగా 'ల్యాబ్ టెక్నీషియన్' హోదాలోనే ప్రభుత్వ ఆస్పత్రులు లేదా విభాగాల్లో పనిచేసి ఉండాలి. వేరే ఇతర హోదాల్లో పనిచేసిన వారికి ఈ వెయిటేజీ వర్తించదు. ఈ నెల 20 నుండి 22 వరకు జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియలో అసలు అక్రమాలు బయటపడ్డాయి. ఏడు జోన్ల పరిధిలో (చార్మినార్, జోగులాంబ, యాదాద్రి, రాజన్న, భద్రాద్రి, బాసర, కాళేశ్వరం) అభ్యర్థుల జాబితాను పరిశీలించిన బాధితులుగ్ర్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్లు, ఆర్టీపీసీఆర్ సైంటిస్టులు, టీ-హబ్ మేనేజర్లు, ల్యాబ్ అటెండెంట్లు సైతం ల్యాబ్ టెక్నీషియన్లుగా తప్పుడు సర్వీస్ సర్టిఫికెట్లు సృష్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నోటిఫికేషన్‌లో సూచించిన ఫార్మాట్‌లో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నత అధికారులదే. అయితే.. క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించకుండానే కొందరు అధికారులు ఈ ఫేక్ సర్టిఫికెట్లను జారీ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోవిడ్ సమయంలో తాత్కాలికంగా పనిచేసిన వారు కూడా నిబంధనలకు విరుద్ధంగా సర్వీస్ మార్కులు పొందినట్లు అభ్యర్థులు ఆధారాలతో సహా నియామక బోర్డుకు ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వెంటనే జాబితాను ప్రక్షాళన చేసి అర్హులకు మాత్రమే నియామక పత్రాలు అందజేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# ఫలించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కృషి..

## బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి.

జమ్మికుంట, డిసెంబర్ 26,



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, 'ఖేలో ఇండియా' ద్వారా క్రీడలు గ్రామ స్థాయికి చేర్చాలనే మాటలకు, జమ్మికుంటే ప్రత్యక్ష ఉదాహరణ అని బీజేపీ సీనియర్ నాయకులు మట్ట పవన్ రెడ్డి, అన్నారు. మట్ట పవన్ రెడ్డి, ఇల్లందకుంట మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 4 లైన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం కోసం రూ. 6.50 కోట్ల నిధులను జమ్మికుంట పట్టణానికి ఖేలో ఇండియా పథకం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ద్వారా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు అందించాలన్న కేంద్ర ప్రభుత్వ దూరదృష్టి వల్ల ఈ ప్రాజెక్టు సాకారం అవుతోందనీ ఈ నిధుల మంజూరు ద్వారా జమ్మికుంట మరియు పరిసర ప్రాంతాల యువతకు ఉత్తమమైన శిక్షణా అవకాశాలు, అథ్లెటిక్ రంగంలో మెరుగైన భవిష్యత్తు కోసం గ్రామీణ ప్రతిభను గుర్తించి, ప్రపంచ స్థాయిలో నిలబెట్టాలన్న క్రీడా విజన్‌కి ఇది మరో ఉదాహరణ అని తెలిపారు. మోడీ ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాల్లో క్రీడలు కూడా ముఖ్యమైన భాగమని ఈ నిర్ణయం మరోసారి రుజువు చేసిందని. జమ్మికుంట పరిసర ప్రాంత యువ క్రీడాకారులు రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతాకాలు ఎగరేవారనే సంపూర్ణ నమ్మకం మాకు ఉందనీ మట్ట పవన్ రెడ్డి, పేర్కొన్నారు. ఈ ట్రాక్ నిర్మాణం పూర్తయిన వెంటనే జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక ,కమలాపూర్ సహా పరిసర మండలాల యువ అథ్లెట్స్‌కు అంతర్జాతీయ స్థాయి శిక్షణా అవకాశాలు లభించనున్నాయనీ స్థానిక ప్రతిభను వెలికితీసి, జాతీయ ? అంతర్జాతీయ వేదికలపై పోటీ చేయగల సామర్థ్యాన్ని పెంపొందించే బలమైన వేదికగా ఈ ప్రాజెక్టు నిలవనుందనీ తెలిపారు. దీనికి కృషి చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ,కి మరియు కేంద్ర మంత్రి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, కు యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మంత్రి మన్సుక్ మాండవియ, కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

# మన పురాణాల గురించి పిల్లలకు చెప్పాలి

## కృష్ణుని మహిమలు, రామరాజ్యం గురించి వివరించాలి

## సీఎం చంద్రబాబు నాయుడు

తిరుపతిస్పైడర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్ వంటివి కాకుండా మన పురాణాల గురించి పిల్లలకు చెప్పండి. హాలీవుడ్ సూపర్ హీరోల కంటే మన పురాణ పురుషులు గొప్ప వారని.. వారిని చరిత్రను వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ కార్యక్రమంలో అయన మాట్లాడారు. సూపర్ మ్యాన్ కంటే మన హనుమంతుడు బలవంతుడని చెప్పాలి. బ్యాట్ మ్యాన్, ఐరన్ మ్యాన్ కంటే మన అర్జునుడు గొప్ప యోధుడని వివరించాలి. మన కృష్ణుని మహిమలు, శివుడి మహత్యం గురించి యువతకు బోధించాలి. రాముడిని మించిన పురుషోత్తముడు ప్రపంచంలో ఎవ్వరూ లేరని... రామరాజ్యం గురించి వివరించాలి. అవతార్ సినిమాకంటే మన భారత, రామాయణాలు గొప్పవని పిల్లలకు చెప్పాల్సిన బాధ్యత మనపై ఉంది. బకాసురుడు, కంసమామ లాంటి రాక్షసుల గురించి కూడా చెప్పాలి. ఎవరు మంచి వాళ్లో... ఎవరు చెడ్డవాళ్లో చెప్పగలిగితే మంచికి, చెడుకి వ్యత్యాసాలు పిల్లలకు తెలుస్తాయి. ప్రజలు పురాణాల గురించి మరిచిపోయే సమయంలో ఎన్టీఆర్ ఎన్నో పురాణ గాథలతో కూడిన సినిమాలు చేశారని అన్నారు. విలువలను చెబుతూ సినిమాల ద్వారా చైతన్యం తెచ్చిన మహా నాయకుడు ఎన్టీఆర్. రాజకీయాల్లోనూ అదే స్థాయిలో విలువలు పాటించిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్. దేశాభివృద్ధికి వాజ్ పేయి పునాదులు వేశారు... ఇప్పుడు ప్రధాని నరేంద్ర అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. వినూత్న ఆలోచనలు చేయాలి... కొత్త ఆవిష్కరణలు చేపట్టాలి.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు ఘన నివాళులు..

## మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్.

జమ్మికుంట, డిసెంబర్ 25(భారత శక్తి):

జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బుడిగ శ్రీకాంత్, ఆధ్వర్యంలో మచ్చలేని మనిషి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, వర్ధంతి సందర్భంగా, శుక్రవారం యూత్ కాంగ్రెస్ నాయకులందరూ కలిసి వారి చిత్రపటానికి పూలమాల వేసి, మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుడిగె శ్రీకాంత్, మాట్లాడుతూ, దేశం ఒక గొప్ప ఆర్థిక సంస్కర్తను



కోల్పోయిందనీ, మాజీ ఆర్థిక శాఖ మంత్రిగా, మాజీ ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్, దేశానికి చేసిన సేవలు దేశం ఏ నాటికి మరిచిపోదనీ తెలిపారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా అనేక గొప్ప చట్టాలను తీసుకొచ్చి పెనుమార్పులు చేశారని, సమాచార హక్కు చట్టం. విద్యా హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, లోక్ పాల్ బిల్లు, జాతీయ ఉపాధి హామీ పథకం వంటి అనేక చట్టాలను అమలు చేసిన ఘనత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ కే దక్కుతుందని యువజన కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. క్రమశిక్షణకు మారు పేరు, నమ్మిన సిద్ధాంతాన్ని జీవితకాలం ఆచరించిన గొప్ప మనిషి మన్మోహన్ సింగ్ అని తెలిపారు.అనంతరం, యువజన కాంగ్రెస్ జమ్మికుంట మండల కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించి ఇటీవల జరిగిన స్థానిక సంస్థల్లో సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా ప్రజా ఆశీర్వాదంతో ఎన్నికైన యువతకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా, పల్లెలు అభివృద్ధి చెందడం కోసం సరియైన ప్రణాళికను ఏర్పరిచే యువ నాయకత్వాన్ని, ప్రోత్సహించిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు ఇదే పంథాలో యువతను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో, జిల్లా ప్రధాన కార్యదర్శులు పర్లపల్లి నాగరాజు, దొడ్డే సంధ్యా నవీన్, జిల్లా కార్యదర్శి సజ్జద్ మహమ్మద్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు పంజాల అజయ్, రోమాల రాజ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు దేవనూరి వినయ్, ఆకినపల్లి శ్యామ్, ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, యువజన నాయకులు సూర్య, సాయి తేజ, శశి, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన భాండాగారంగా భారతదేశం

తిరుపతి, డిసెంబర్ 26,

భారత సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచంలోనే అరుదైన, గొప్ప విషయాలని.. అవతార్ సినిమా కంటే భారతం, రామాయణం గొప్పవని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హాలీవుడ్ సూపర్ స్టార్లు, బ్యాట్‌మన్, అవెంజర్స్ కంటే అర్జునుడు గొప్ప యోధుడు అని పిల్లలకు మనం చెప్పాలని సూచించారు. వేల ఏళ్ల కిందటే ప్రపంచానికి ఆయుర్వేద వైద్యంతో పాటు అర్బన్ టౌన్ ప్లానింగ్ నేర్పించిన ఘనత భారత్‌కు దక్కుతుందన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించిన భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ దేశాభివృద్ధి కోసం ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేస్తున్న కృషిని కొనియాడారు. మన దేశ విశిష్టతను, భారతీయతను చర్చించుకోవడానికి భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ ఒక అద్భుతమైన వేదికగా అభిప్రాయపడ్డారు. ప్రాచీన కాలం నుండే భారతదేశం విజ్ఞాన భాండాగారంగా విరాజిల్లిందని, వేల ఏళ్ల క్రితమే హరప్పా నాగరికత ద్వారా మన పూర్వీకులు అద్భుతమైన అర్బన్ ప్లానింగ్‌ను ప్రపంచానికి చాటిచెప్పారని గుర్తుచేశారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద గురించి వివరిస్తూ, సుమారు 2900 ఏళ్ల క్రితమే భారతీయులు యోగాభ్యాసాన్ని ప్రారంభించారు. వివిధ రంగాల్లో భారతదేశం సాధించిన నైపుణ్యాన్ని వివరిస్తూ ఆస్ట్రానమీలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరక, ధన్వంతరి, ఆర్థిక శాస్త్రంలో కౌటిల్యుడు వంటి మహానుభావుల సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం 150 దేశాలు దీనిని అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే 2600 ఏళ్ల క్రితమే ఆయుర్వేదం ద్వారా వైద్య సేవలు అందించిన ఘనత మనదే అన్నారు. తక్షశిల, నలంద వంటి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయాలు మన దేశంలోనే ఉండటం గర్వకారణం అన్నారు. గణిత శాస్త్రంలో అత్యంత కీలకమైన 'సున్నా'ను కనుగొనడమే కాకుండా, మేధస్సుకు పదును పెట్టే చదరంగ క్రీడను కూడా భారతీయులే సృష్టించారని పేర్కొన్నారు. వీరందరూ సృష్టించిన చరిత్ర భావి తరాలకు నిరంతరం స్ఫూర్తిని కలిగిస్తుందని అన్నారు. కీలక రంగాల్లో భారత నిపుణులు సాధిస్తున్న విజయాలు దేశ ప్రతిష్టను విశ్వవ్యాప్తం చేస్తున్నాయని, అటువంటి గొప్ప వారసత్వాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

అవతార్ సినిమా కంటే రామాయణం, మహాభారతం గొప్పవి

'ప్రస్తుత కాలంలో పిల్లలు స్పైడర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్ వంటి హాలీవుడ్ సూపర్ హీరోల పట్ల ఆకర్షితులవుతున్నారు. అయితే మన భారతీయ పురాణాల్లో అంతకంటే గొప్ప వీరులు, అద్భుత శక్తులు కలిగిన పురుషులు ఉన్నారన్న నిజాన్ని వారికి వివరించాలి. సూపర్ మ్యాన్ గాలిలో ఎగురుతాడని మనం ఆశ్చర్యపోతాం, కానీ వేల ఏళ్ల క్రితమే మన హనుమంతుడు సముద్రాలను లంఘించి, సంజీవని పర్వతాన్నే అరచేత్తో మోసుకొచ్చిన మహా బలవంతుడని పిల్లలకు చెప్పాలి. అలాగే బ్యాట్ మ్యాన్, ఐరన్ మ్యాన్ వంటి వారి యుద్ధ తంత్రాల కంటే, గాండీవధారి అయిన అర్జునుడి విలువిద్య, యుద్ధ కౌశలం ఎంతో గొప్పవని వారికి బోధించాలి. అవతార్ వంటి సినిమాలు ఊహాజనిత ప్రపంచాలను చూపిస్తే, మన రామాయణ, మహాభారతాలు అంతకంటే అద్భుతమైన సంఘటనలతో, జీవన సత్యాలతో నిండి ఉన్నాయి. యువతకు మన కృష్ణుని లీలలు, శివుడి మహత్యాన్ని వివరించడం ద్వారా మన సంస్కృతి పట్ల వారికి గౌరవం పెరుగుతుంది. శ్రీరాముడిని మించిన పురుషోత్తముడు ఈ ప్రపంచంలోనే లేరని, ఆయన పరిపాలించిన రామరాజ్యం నేటికీ ఆదర్శప్రాయమని చెప్పాలి. అదే సమయంలో బకాసురుడు, కంసమామ వంటి రాక్షసుల కథలను వివరించడం ద్వారా మంచికి, చెడుకు మధ్య ఉండే వ్యత్యాసాన్ని పిల్లలు సులభంగా అర్థం చేసుకోగలుగుతారు. సమాజం పురాణాలను మర్చిపోతున్న తరుణంలో నందమూరి తారక రామారావు తన సినిమాల ద్వారా ఆ పురాణ గాథలను ప్రజల గుండెల్లోకి తీసుకెళ్లారు. కేవలం సినిమాల్లోనే కాకుండా, రాజకీయాల్లో కూడా విలువలను పాటిస్తూ ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని తీసుకువచ్చిన మహానేత ఎన్టీఆర్. దేశాభివృద్ధి విషయంలో కూడా భారతదేశం అద్భుతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. మాజీ ప్రధాని వాజ్ పేయి అభివృద్ధికి గట్టి పునాదులు వేయగా, ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం వేగంగా దూసుకుపోతోంది. యువత వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు చేపట్టాలని, తద్వారా భారతదేశం భవిష్యత్తులో ప్రపంచ దేశాలన్నింటికీ నాయకత్వం వహించే సూపర్ పవర్‌గా మారుతుంది.

# కలెక్టర్ ను కలిసిన నిర్మల, జగ్గారెడ్డి

## - తాగునీటి సమస్యలపై సమీక్షా సమావేశం



సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, డిసెంబర్ 26:

సంగారెడ్డి మున్సిపాలిటీలో మంచినీటి సమస్యలపై చైర్ పర్సన్ నిర్మల రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యను శుక్రవారం కలెక్టరేట్లో కలిసి ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా జరగడం లేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా భవిష్యత్తులో నీటి ఇబ్బందులు ఉండకుండా చూడాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్, ప్రతిరోజూ మిషన్ భగీరథ నుంచి 8.5 ఎంఎల్డీ నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప దేవాలయానికి బిఆర్ఎస్ యువ నాయకుడు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి విరాళం అందజేత

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 26:



జిల్లాలోని నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయానికి బిఆర్ఎస్ యువ నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు 25వేల రూపాయల విరాళాన్ని స్వయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అయ్యప్ప స్వామి కృప కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మరో 9 గిన్నిస్ రికార్డులు లక్ష్యంగా..

## - చరిత్ర సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న గీతం పూర్వ విద్యార్థిని శివాలి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 26 :



మరో తొమ్మిది గిన్నిస్ వర్డల్ రికార్డులతో చరిత్ర సృష్టించాలనే లక్ష్యంతో గీతం పూర్వ విద్యార్థిని (2016-20) శివాలి జోహ్రి శ్రీవాస్తవ ముందుకు సాగుతోంది. తన తల్లి కవితా జోహ్రి శ్రీవాస్తవతో కలిసి ప్రపంచంలోనే అతిపెద్ద ఓరిగామి కళా ప్రదర్శనను హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసింది.

ఈ రికార్డు ప్రయత్నాలలో భాగంగా, ఓరిగామి కుక్కలు (3,500), టోపీలు (1,600), ఎలుగుబంట్లు (2,500), పైన్ ఆకులు (3,900), ఎక్స్ కవేటర్లు (3,500), డాల్ఫిన్లు (2,500), పేపర్ సర్ఫ్ డిజైన్లు (3,100), క్విల్డ్ ఏంజెల్స్ (3,500), క్విల్డ్ బొమ్మలు (2,700) అతి పెద్ద ప్రదర్శనను గీతంలో ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన వివరాలన్నింటికీ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ వారికి పంపి, పరిశీలన తరువాత వారు అధికారక ఫలితాలను వెల్లడిస్తారు. శివాలి జోహ్రి శ్రీవాస్తవ ఇప్పటికే 21 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ తో పేపర్ ఆర్ట్ ప్రపంచంలో ఒక ప్రసిద్ధ పేరు సాధించి, భారతదేశంలో అత్యధిక సంఖ్యలో గిన్నిస్ వరల్డ్ రికార్డులను కలిగి ఉన్న వ్యక్తిగా నిలిచారు. ఆమె సాధించిన విజయాలలో వేలకొద్దీ చేతితో తయారు చేసిన కాగితపు బొమ్మలు, క్విల్డ్ పువ్వులు, ఓరిగామి జంతువులు, వాహనాలు, పక్షులు, ఆకులు, అలంకాల రూపాల రికార్డు బద్దలు కొట్టే ప్రదర్శనలు ఉన్నాయి. ఇవి అసాధారణమైన ఖచ్చితత్వం, సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రతిబింబిస్తాయి. శివాలి గిన్నిస్ రికార్డులతో పాటు 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులు, 15 యూనిక్ వరల్డ్ రికార్డులను సాధించింది. ఇవి ఓరిగామి, క్విల్లింగ్ కళలో ఆమె అసాధారణ ప్రతిభ, పట్టుదలను ఎలుగెత్తి చాటుతున్నాయి. గీతం ఉన్నతాధికారులు-హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, వివిధ విభాగాధిపతులు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు శివాలి ఈ కొత్త ప్రపంచ మైలురాళ్లను సాధించాలని అభిలషిస్తున్నారు.

# అర్హులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాల్సిందే..

# అందుకోసమే ఐక్య పోరాటాలు

## డబ్ల్యూజే రాష్ట్ర నేతలు కరుణాకర్, ప్రమోద్ కుమార్

## డబ్ల్యూజెఐ లో చేరిన కొడిమ్యాల పాత్రికేయులు



కరీంనగర్,డిసెంబర్, 26(భారతశక్తి ప్రతినిధి):

అక్రిడిటేషన్ల విషయంలో రాష్ట్రంలోని జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రతిఘటిస్తామని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాడూరు కరుణాకర్, కార్యదర్శి శివవనాద్రి ప్రమోద్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం జగన్నాథ రెడ్డిలు తెలిపారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన పలువురు జర్నలిస్టులు శుక్రవారం వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియాలో చేరిన సందర్భంగా వారిని స్వాగతించారు. జస్టిస్ కుమారయ్య వేడుకల మందిరంలో జరిగిన కార్యక్రమంలో డబ్ల్యూజెఐ నేతలు మాట్లాడుతూ... నూతన అక్రిడిటేషన్లకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అసమంజసంగా, అసంబద్ధంగాఉన్నాయని ఆరోపించారు. ఈ విషయంలో రాష్ట్రంలోని జర్నలిస్టులకు న్యాయం జరిగేంతవరకు తమ పోరు ఆగబోదని స్పష్టం చేశారు. కలసి వచ్చే అన్ని జర్నలిస్ట సంఘాలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం విషయంలో తమ సంఘం నిబద్ధతగా పనిచేస్తుందని చెప్పారు. జర్నలిస్టులను తమ స్వప్రయోజనాల కోసం వాడుకొని వదిలేసే సంఘాల నాయకత్వ తీరు చూసి అనేకమంది తమతో కలిసి రావడానికి ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. వారి ఆశలు ఆకాంక్షలు నెరవేర్చే దిశగా తమ సంఘం పనిచేస్తుందని చెప్పారు. పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో జర్నలిస్టులు తమ సమస్యల పరిష్కారం కోసం దశాబ్ద కాలానికి పైగా ఎదురుచూపులు చూడడం దురదృష్టకరం అన్నారు. కేవలం ఒక సంఘ నాయకుని సలహాలు, సూచనలు ప్రభుత్వం పాటించడం ప్రస్తుతం రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న దుస్థితికి కారణం అన్నారు. అలాంటి వ్యక్తులను, సంఘాలను దూరం పెట్టని పరిస్థితుల్లో యావత్ జర్నలిస్ట సమాజం ప్రభుత్వానికి దూరమయ్యే ప్రమాదం ఉంటుదని గుర్తు పెట్టుకోవాలన్నారు. దీనిని ప్రభుత్వంలోని పెద్దలు పరిశీలించి ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కొడిమ్యాల మండల వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గానికి యూనియన్ నేతలు కరుణాకర్, ప్రమోద్ కుమార్, కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# స్నేహితుడు కుటుంబానికి ఆర్థిక సాయం

గుమ్మడిదల,భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 26 :



స్నేహితులు కేవలం సుఖాల్లోనే కాదు కష్టాలలో తోడుంటామని నిరూపించారు. మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలిచారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన బైండ్ల రమేష్ అనారోగ్య సమస్యతో ఇటీవల మృతి చెందగా మిత్రుని కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలని గుమ్మడిదల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ మిత్రులు తమ వంతు సహాయంగా అతని భార్యకి 1,32,100/- అందజేసి వారి ఇద్దరి కుమారుల పైన ఎస్బిఐ బ్యాంకు లో ఫిక్స్డ్ డిపాజిట్ చేశారు. భవిష్యత్తులోనూ అతని భార్యా పిల్లలకు అండగా నిలుస్తామని భరోసా కల్పించారు.

# క్రికెట్ టోర్నమెంట్లో వరికుంట్ల టీం విజయం.

## రెవరెంట్ ఫాదర్. జయరాజ్ ఆధ్వర్యంలో టూనమెంట్ నిర్వాహన



పోరుమామిళ్ల, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 26: కడప జిల్లా శ్రీ అవధూత కాశినాయన మండలం వరికుంట్ల విచారణలో యువతకు నూతన సంవత్సర సందర్భంగా టోర్నమెంట్ నిర్ణయించడం జరిగింది. ఈ టోర్నమెంట్లో విచారణ లో ఉండు బాలయ పల్లె. నాయనపల్లి. ఎగువ పాలెం. దిగువపాలెం యువత క్రికెట్ టోర్నమెంట్ కు ముందుకు రావడం జరిగింది. ఈ టోర్నమెంట్లో ఘనవిజం సాధించిన వరికుంట్ల యూత్ కు విచారణ గురువులు అభినందనలు తెలియజేశారు. ఇలాంటి ఆటల పోటీలు ఇంకా విజయం సాధించాలని మరియు యువత అన్ని విషయాలలో ముందుండి నడవాలని ఈ నూతన సంవత్సర శుభ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారు వచ్చిన మిగతా గ్రామాల యువతకు కూడా అభినందనలు తెలియజేశారు. ఈ అన్ని గ్రామాలకు గాను వరికుంట్ల యువత క్రికెట్ టోర్నమెంట్లో విజేత సాధించినందుకు అభినందనలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ బాలుర వసతి గృహము, ప్రభుత్వ పరిశీలన గృహము విజిట్ మరియు న్యాయవిజ్ఞాన సదస్సు



కడప, డిసెంబర్ 25(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి.యామిని సూచనల మేరకు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప కడప నగరంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహమును, ప్రభుత్వ పరిశీలన గృహమును విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది. పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత మరియు భద్రత ఆరోగ్యం మరియు పరిశుభ్రత ఆహారం మరియు మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వంటశాలను వసతిగదులను టాయిలెట్లను పరిశీలించారు, విద్య విలువైనది క్రమశిక్షణతో అభ్యసించాలి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, పిల్లలకు అందుతున్న భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024 వివరించారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, ఉచిత న్యాయ సహాయము మొదలు అంశాలపై అవగాహన కలిగించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కడప దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహము, ప్రభుత్వ పరిశీలన గృహము సూపర్ ఇండెంట్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు




కడప, డిసెంబర్ 25(భారత శక్తి):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు పానెల్ న్యాయవాదులచే కడప నగరం అశోక్ నగర్ నందు 26-12-2025 వ తేదీన "నల్సా (ఆశ–అవగాహన, మద్దతు, సహాయం మరియు చర్య) ప్రామాణిక ఆపరేటింగ్ విధానం ? బాల్య వివాహాలను నిర్మూలించడానికి, 2025, భారతదేశవ్యాప్తంగా పర్యావరణ చట్టపరమైన అక్షరాస్యత మరియు సమాజ రక్షణ చొరవ "ఈరోజు రక్షించు, రేపు సురక్షితం"మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు మరియు చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 ప్రచార కార్యక్రమాలు" నిర్వహించడం జరిగినది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి, బాల్య వివాహాల నుండి రక్షించబడిన వారికి మానసిక, సామాజిక మద్దతు అందించడం, నల్సా అనేది బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు అందించే సంస్థ. ఆశ ప్రోగ్రామ్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఆశ అనేది బాల్య వివాహాల నివారణకు నల్సా ప్రారంభించిన ఒక సమగ్ర కార్యక్రమం, ఇది చట్టపరమైన, సామాజిక, మానసిక సహాయాన్ని అందిస్తూ, బాధితులకు అండగా నిలుస్తుంది.

ఘన వ్యర్థాలను సరిగ్గా పారవేయకపోవడం అపరిశుభ్రమైన పరిస్థితులను సృష్టిస్తుంది మరియు ఈ పరిస్థితులు పర్యావరణాన్ని కలుషితం చేస్తాయి మరియు వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తికి దారితీస్తాయి, పొడి చెత్త తడి చెత్త, తాగునీరు,

ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రభుత్వ కార్యక్రమాలు: వేస్ట్ టు వెల్త్ పోర్టల్, స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహన, చెత్త రహిత నగరాల యొక్క స్టార్ రేటింగ్, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నియమాలు, 2016, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ నియమాలు, 2016.

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 48 (ం) 51 (ం) (ఱ) నిబంధనల కింద పర్యావరణ పరిరక్షణ ను పొందుపరిచారు . ఇలా జీవవైవిధ్యాన్ని కాపాడటానికి ప్రభుత్వానికి సర్వహక్కులు ఇచ్చిన మొదటి దేశం భారతదేశం. పర్యావరణ సంరక్షణ చట్టం 1986, వాయు కాలుష్య నివారణ నియంత్రణ చట్టం 1981, నీటి కాలుష్య నివారణ నియంత్రణ చట్టం 1974, హానికర వ్యర్థాల నియంత్రణ చట్టం 1989, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల చట్టం 1998, ధ్వని కాలుష్యం నియంత్రణ చట్టం 2000, ప్లాస్టిక్ రీసైకిల్ ఉత్పత్తి వాడక చట్టం 2003, జాతీయ హరిత ట్రిబ్యునల్ చట్టం 2010, అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 చట్టాలను వివరించడం జరిగినది.

చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగంశాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో పానెల్ న్యాయవాదులు అయ్యవరప్ప మరియు విక్రమ్, పారా లీగల్ వాలంటరీలు శ్రీనివాసరావు, వర కుమార్ ఎన్జీవో లు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# వ్యక్తి సర్వతోముఖ వికాసానికి మార్గం పుస్తకం

## "పుస్తకాలు దీపాలవంటివి వాటి వెలుతురు మనో మాలిన్యమనే చీకటిని తొలగిస్తుంది." – "డాక్టర్ "బి' ఆర్' అంబేడ్కర్"

పుస్తకం మూడు అక్షరాలే అయిన ఎంతో మంది కలలకు, ఉజ్వల జీవితాలకు ఆధారం. పుస్తక పఠనం మనిషిలో విజ్ఞానాన్నిపెంచుతుంది . పుస్తకం సామాన్యుని ఆయుధం. "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో ." అన్నారు కందుకూరి వీరేశలింగం పంతులు. ఆ మాటలు నేటికి పుస్తక ప్రియుల చేవుల్లో మార్మోగుతూనే ఉంటాయి. ఒక మంచి పుస్తకం వేయి మంది మిత్రులతో సమానమని అన్నారు మరో మహానుభావుడు. ఎందరో మహానుభావులు పుస్తక పఠనం విశిష్టతను ప్రయోజనాలను తెలియచేశారు.



పుస్తకం ఓ మంచి నేస్తం

ఒంటరి తనములో తోడుగా ఉండే ఓ మంచి స్నేహితుడు పుస్తకం. "పుస్తకం ఓ మంచి నేస్తం ".పుస్తకం అమ్మలా లాలిస్తుంది. నాన్నలా ఆదరిస్తుంది. గురువులా హితబోధ చేస్తుంది. బాధపడే వారిని ఓదార్చుతుంది.అలసిన మనసులను సేద తీరుస్తుంది.అందుకే పుస్తకం అనితరమైన ఆయుధంగా నేస్తంగాఅన్ని తరాలను అలరిస్తోంది. జీవితంలో విజ్ఞానాన్ని సంపాదించుకొని ఉన్నత స్థాయికి ఎదగడానికి దోహదపడే సాధనంపుస్తకం. ×పుస్తకం మనోవికాసానికి మార్గదర్శి× మనోవికాసానికి మార్గనిర్దేశానికి "గురువుగా" ఉపయోగపడుతుంది. పుస్తక ప్రచురణ ప్రారంభమయిన తర్వాత మానవ జీవన గమనంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి.ఉదయం టీ తాగితే వచ్చే హాయి పుస్తక పఠనంతో అంత హాయి వస్తుంది అంటారు పుస్తక ప్రియులు . పుస్తక ప్రియులకు అన్నిటిని మరిపించే విజ్ఞాన, వినోద, వికాస భాండాగారం పుస్తకం. జీవితములో ఉన్నత స్థాయికి ఎదిగిన వారి విజయ రహస్యం పుస్తకం. వారు ఎదిన క్రమంలో అనుభవాలు ఎదురుకొన్నకష్టాలను అక్షర రూపంలో అందించి ధైర్యాన్ని ఇస్తుంది పుస్తకం. పుస్తక పఠనం వల్ల సామాజిక అవగాహన సమస్యల పరిష్కార శక్తి యుక్తి ఇనుమడిస్తుంది. సమయానుకూల స్పందనను మెరుగైన ప్రజా సంబంధాల దృఢత్వంతో. మానవీయ విలువలు రక్షించబడుతాయి ." నా బార్య బిడ్డల కన్న పుస్తకమే నాకు ఎక్కువ నా ప్రాణం పుస్తకం" అని ×ఆంభేడ్కర్× అన్నారు. పుస్తకాలకు ఆయన అంత విలువనిచ్చే వారు.ప్రస్తుతం అన్ని వయసుల వారు పుస్తకాలకు దూరమైటి 'వి చూస్తూ, వీడియో గేమ్స్ ఆడుతూ మానవ సంబంధాలు లేకుండా ఒంటరి జీవితానికి అలవాటు పడడం శోచనీయం. ఎప్పుడు సోషల్ మీడియాలో వుంటు కాలం గడిపే దుస్థితిలో కూరుకు పోవడం వల్ల ఒత్తిడికి లోనవుతున్నారని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయి. పుస్తకాలను మ్యూజియంలో పెట్టుకొనిచూడడం తప్ప చదవడానికి ఆసక్తి చూపడం లేదు.

పుస్తక పఠనంవిజ్ఞాన వికాసం

ఓ మంచి పుస్తకం చదవడంలో ఉన్న ఆనందం అనుభవంతో తెలిసివస్తుంది. పుస్తకాన్ని చదవడంతో మనోవికాసం కలిగి నూతన ఆలోచనలు జనిస్థాయి . పుస్తకం అజ్ఞాన్ని తొలిగించి విజ్ఞాన్నిఅందిస్తుంది . గురువులా బోధిస్తుంది .ఒంటరితనంలో స్నేహితుడి లాగా అక్కున చేర్చుకుంటుంది. బాధపడేవారిని ఓదారుస్తుంది .అలసిన మనసుకు సేద తీరుస్తుంది .అందుకే పుస్తకం పఠనం తరాల తరాల సంస్కృతిని అందిస్తుంది. మానవ నాగరికత చరిత్ర వారసత్వం జాతి ఔన్నత్యం పట్ల అవగాహనకు పుస్తక పఠనం "వారధిగా" నిలవడం గమనార్హం. ప్రపంచ పుస్తక దినోత్సవం పురస్కరించుకొని పుస్తక పఠనం ఒక సామాజిక ఉద్యమంగా కొనసాగాల్సిన అవసరం ఉంది.

మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది ఉన్నాయి.సమకాలీన సమాజంలో సామాజిక' సాంకేతిక మార్పులు ఎన్ని వచ్చిన పుస్తక ప్రియులు పుస్తకాన్ని వదలలేదు.సినిమాలు' టివి లు 'ఇంటర్నెట్ మొబైల్' మాయలు దరి చేరిన పుస్తకం విలువ తగ్గలేదు. రచయిత కాఫ్కా"మనల్ని గుచ్చి గాయపరిచి ఇబ్బంది పెట్టే రచనలు చదవాలి. మంచి పుస్తకం మనలో దాగి వున్న ప్రతిభను సృజనను తట్టి లేపాలి.పుస్తక పఠనం మనలో గడ్డ కట్టిన సముద్రాన్ని గొడ్డలి లాగా పగుల కొట్టాలి" అంటాడు ప్రముఖ "రచయిత కాఫ్కా."

పుస్తక పఠనం ఆరోగ్యానికి మేలు×"×పుస్తక పఠనం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మేధస్సు సక్రమంగా పనిచేస్తుంది పాజిటివ్ ఆలోచనలు ప్రేరేపిస్తుంది .నెగెటివ్

దృక్పథాన్ని అరికడుతుంది.శ్రీ పుస్తక పఠనం బహుళ ప్రయోజనాలను నూతన ఆలోచనలు సృజన శక్తి తాత్వికతశాస్త్రీయత విశ్లేషణ పరిశీలన పరిశోధన పరిష్కారం సామర్థ్యం నూతన ఆవిష్కరణలకు దోహదపడుతుంది.

విశ్లేషణా సామర్థ్యాలను. పెంపొందిస్తుంది.

పుస్తకంపఠనం ఒత్తిడిని తగ్గిస్తుంది× అనవసర ఆలోచనలు నియంత్రిస్తుంది .శారీరక మానసిక ఆరోగ్యం చేకూరుతుంది .ఒత్తిడి నుండి విముక్తి చెందాలంటే రాత్రి పడుకునే ముందు సాహిత్యానికి సంబందించిన పుస్తకాలు చదవడం మంచిది.శారీరక మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది .అలాగేఏకాగ్రత చేకూరి ఒంటరి తననాన్ని దూరం చేస్తుంది.ఎదిగే పిల్లలకు ఒక్కో వయసులో ఒక్కో తరహా పుస్తకం అవసరం. ప్రారంభంలో బొమ్మలు కథలు పుస్తకాలు మొదలుపెట్టి నాగరికతలు '' పరికరాలు 'సాహస గాథలు ' మహనీయుల జీవిత చరిత్రలు ' శాస్త్రవేత్తలు' శాస్త్రవేత్తల 'పరిశోధనలు " మొదలగు అంశాల మీద అవగాహన చైతన్యం కలిగించడానికి అవసరమయ్యే పుస్తకాలు చదివే అలవాటు జీవన విధానములో బాగం కావాలి .

ఏప్రిల్ 23న ప్రపంచ పుస్తక దినోత్సవం. ప్రపంచ వ్యాప్తంగావేరు వేరు (విభిన్న) తేదీలలో జరుపుకుంటున్నప్పటికి ఇన్ని ప్రత్యేకతలు వున్న ఏప్రిల్ 23 వ తేదీని ప్రపంచ పుస్తక దినోత్సవం పాటించాలని 1955 లో యునెస్కో ప్రకటించింది. అంతే కాకుండా ప్రపంచ పుస్తక కాపీ హక్కుల దినంగా జరుపాలని రచయితలు ప్రచురణ కర్తలు పాఠకులు ఉపద్యాయులను ఈ రోజు గౌరవించాలని సూచించింది. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో "పుస్తక మహోత్సవాన్ని" నిర్వహిస్తారు ఏప్రిల్ 23వ తేదీన ప్రపంచ పుస్తక దినోత్సవం పాటించాలని పారిస్ లో 1955లో జరిగిన యునెస్కో సాధారణ సమావేశములో 23 ఏప్రిల్ ను ప్రపంచ పుస్తక కాపీ రైట్ దినోత్సవం గా ప్రకటించింది.

భారత్ లో చదువరుల సంఖ్య ఎక్కువ ప్రపంచంలోపుస్తకాలు చదివే (పాఠకులు) చదువరుల సంఖ్యమీధ జరిపిన సర్వే లో భారతదేశంలో చదివే వారు ఎక్కువ ఉన్నట్టు తేలింది. ఈ సర్వే పలు ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువపుస్తకాలు చదివే వారు భారతీయులే . భారతీయులు వారానికి సగటున 10.2 గంటలపాటుపుస్తక పఠనం చేస్తారని దశాబ్ధం కింద చేసిన ఒక అధ్యయనము లో తేలింది. 2013 నాటి సర్వే ప్రకారం పుస్తక పఠనం సమయం 10.4 గంటలకు పెరిగింది. టీ'వీలు సినిమాలు ఇంటర్నెట్ వినియోగం మారుతున్న జీవనశైలివల్ల పుస్తక పఠనము పై మోజు తగ్గలేదు.పుస్తక పఠనం లో భారత్ టాప్ లో వుండడం గర్వించదగిన అంశం( గమనార్హం) పుస్తక పఠనం చేసే వారి సంఖ్య మరింత పెరగాలని పుస్తక ప్రియులు కోరుకుంటున్నారు. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో ఉరుకుల పరుగుల జీవితంలో పుస్తకపఠనం తగ్గిపోయింది ఆన్లైన్లో చదువుతున్నారు .పుస్తకాలు పట్టుకుని పఠనం చేయడం మర్చిపోతున్నారు . అందుకే కొన్ని స్వచ్ఛంద సంస్థలు తమకు తోచినట్టుగాపుస్తక పఠనం పట్ల ప్రజల్లో ఆసక్తి కలిగించే ప్రయత్నం చేస్తున్నాయి. అందులో భాగంగా పుస్తక ప్రదర్శన పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై సెమినార్లు సదస్సులు వివిధ ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించడం గమనార్హం.

ప్రభుత్వం పౌరసమాజం

పౌరసమాజం' స్వచ్ఛంద సంస్థలు ధార్మిక సంస్థలు 'మహిళా సంఘాలు 'యువజన సంఘాలు విద్యార్థి సంఘాలు' ఉద్యోగ సంఘాలు' గ్రంధాలయాలస్థాపనకు నిర్వహణకు పూనుకోవాలి.పఠనంతో పరిజ్ఞాన పరివ్యాప్తిలో క్రియాశీలక భాగస్వాములుకావాలి.పుస్తకాలు చదివే లక్షణం వాతావరణం ప్రజల్లో కలిగించాలి.పుస్తకాలు కొని చదివే సంస్కృతిని పెంపొందించడం . పుస్తకాలు ప్రపంచానికి చేసిన సేవలు గుర్తు చేసుకోవడం కొత్త తరాలను పుస్తక పఠనం వైపు ఆకర్షించడం ప్రపంచ పుస్తక పఠన దినోత్సవం సందర్భంగా యునెస్కో ఆశయాలసాధన దిశగాకృషి జరగాలి.కేంద్ర 'రాష్ట్ర' స్థానిక ప్రభుత్వాలు పౌర గ్రంథాలయాలు స్థాపనకు పూనుకోవాలి . పాటశాల కళాశాల స్థాయిలో లైబ్రరీ లలో డిజిటల్ టెక్నాలజీ ఆధునిక సమాచార

సౌకర్యాలను ఏర్పాటు చేయాలి.ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి మౌలిక సదుపాయాలు కల్పించాలి. పాఠకులకు మెరుగైన సేవలు అందించాలి .మానవ వనరుల సర్వతోముఖాబివృద్ధికిదోహదపడే బహుముఖ చర్యలుచేపట్టి ×విజ్ఞాన భారత్ ×నిర్మాణానికి పటిష్ట కార్యాచరణ ప్రణాళిక తో సగ్రమైన చర్యలకు.సంసిద్ధం కావాలని ఆశిద్దాం .

నేదునూరి కనకయ్య

అధ్యక్షులుతెలంగాణ ఎకనామిక్ ఫోరం

తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక 9440245771

# సినిమా



## సమయం వచ్చినప్పుడు మన విలువ తెలుస్తుంది

: తేజ సజ్జా

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ హిట్ సినిమాలను తన ఖాతాలో వేసుకుంటున్నారు యువ నటుడు తేజ సజ్జా. తాజాగా ఆయన ఓ చిట్ చాట్‌లో పాల్గొన్నారు. కెరీర్ విషయాలు, తనపై వచ్చిన ట్రోల్స్‌పై స్పందించారు. దేనికైనా సమయం రావాలని అన్నారు. ''పెద్ద పెద్ద హీరోలను కూడా ట్రోల్స్ చేస్తుంటారు. నేషనల్ అవార్డులు వచ్చిన చిత్రాలపై కూడా విమర్శలు చేస్తారు. వాళ్లు అలా అంటున్నారని మనం ఆలోచిస్తూ కూర్చుంటే ముందుకు సాగలేం. మన ప్రతిభను నమ్ముకుంటూ కెరీర్‌లో ముందుకెళ్లాలి. ఇప్పుడు కాకపోతే 10 ఏళ్ల తర్వాత అయినా వాస్తవాలు బయటికొస్తాయి. సమయం వచ్చినప్పుడు మన విలువ తెలుస్తుంది. విమర్శించే వారిని దృష్టిలో పెట్టుకుంటే పని చేయలేం. ఆడియన్స్‌ను కొత్త కథలతో ఎలా అలరించాలి అనే ఆలోచించాలి. మనకంటూ గుర్తింపు వచ్చిన తర్వాత ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇక్కడ దాకా వచ్చాను అని చెప్పడం కంటే ఆడియన్స్ వల్లే ఈ స్థాయిలో ఉన్నా అని చెప్పాలి. ఎందుకంటే బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వాళ్లకు ఒత్తిడి, ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయి'' అని తేజ సజ్జా చెప్పారు. ''ఒకేసారి పెద్ద హీరో అయిపోవాలి అని ఇండస్ట్రీకి రాకూడదు. మనతో సినిమా తీస్తే కచ్చితంగా మినిమం గ్యారెంటీ ఉంటుంది అనేలా మనల్ని మనం నిరూపించుకోవాలి. అవకాశాలు వచ్చే వరకూ ఇండస్ట్రీలో వర్క్ చేస్తూ ఉండాలి. రవితేజ 10 సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. అంత కష్టపడ్డారు కాబట్టి ఈరోజు స్టార్‌గా ఎదిగారు. నేను చేసిన సినిమాల్లో ఏది ఇష్టం అంటే చెప్పలేను. 'హనుమాన్' వచ్చినప్పుడు చాలా బాగా చేశానని అనుకున్నా.. మిరాయ్ విడుదలైన తర్వాత 'హనుమాన్'లో కంటే అందులో బాగా నటించానని అనిపించింది. ప్రతి సినిమాకు మనల్ని మనం మెరుగుపర్చుకోవాలి'' అని తేజ అన్నారు.

## న్యూఇయర్ సర్‌ప్రైజ్.. ఓటీటీలో కొత్త మూవీ 'మోగ్లీ'



తన ప్రేమ కోసం యుద్ధం చేస్తున్న ప్రతివాడూ హీరోనే అంటూ థియేటర్స్‌లో సందడి చేశాడు మోగ్లీ. రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా సందీప్‌రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. డిసెంబరు 13న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ మూవీ యువతను ఆకట్టుకుంది. నాయకానాయికల జోడీ, ప్రతినాయకుడి పాత్ర, విజువల్స్, సంగీతం ఈ సినిమాకు అదనపు బలాన్ని ఇచ్చాయి. ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి ఈ మూవీ సిద్ధమైంది. కొత్త సంవత్సరం కానుకగా తెలుగు ఓటీటీ వేదిక 'ఈటీవీ విన్'లో జనవరి 1వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఈటీవీ విన్ పోస్టర్‌ను పంచుకుంది.

## రుణపడి ఉంటా

మా ఇంటి బంగారం మూవీతో ప్రస్తుతం బిజీగా ఉన్న నటి సమంత రూత్ ప్రభు. నందినిరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను సమంతనే నిర్మిస్తుంది. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్ అనే సిరీస్ కూడా చేస్తోంది. ఈ ఏడాదే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ ను స్థాపించి, శుభం సినిమాను రిలీజ్ చేసిందామె. డిసెంబర్ 1న కోయంబత్తూర్‌లోని ఈషా ఫౌండేషన్ లో దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి వివాహ బంధంలోకి అడుగు పెట్టిన విషయం తెలిసిందే. 2025 ముగింపు దశకు రావడంతో సమంత ఈ ఏడాది జ్ఞాపకాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. 2025 తనకెంతో గొప్ప సంవత్సరమని, ఈ ఏడాదికి రుణపడి ఉంటానని పేర్కొంది. ఈ ఏడాది తన జీవితంలో జరిగిన విషయాలను గుర్తు చేసుకుంటూ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంది. అన్సీన్ వెడ్డింగ్ ఫొటోతో పాటు శుభం సినిమాలో చిత్రాలను షేర్ చేసింది. ప్రస్తుతం ఆ ఫొటోలు వైరల్ అవుతున్నాయి.



## ఎగ్జామ్స్‌లో ఫెయిల్

ఇటీవలి కాలంలో టీవీ నటుడు రవి దూబే పేరు సౌత్ లో ప్రముఖంగా వినిపిస్తోంది. అతడు నితీష్ తివారీ రామాయణంలో లక్ష్మణుడిగా ఎంపికైన తర్వాత ఎక్కువగా పాపులరయ్యాడు. మోడల్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ఆయన 2006లో స్త్రీ తేరి కహానీ షోతో నటుడిగా మొదలుపెట్టి.. డోలీ సజా కే, యహాన్ కే హమ్ సికందర్ వంటి షోలలో పాత్రలతో, కుటుంబ నాటక షోలైన సాస్ బినా ససురల్, జమై రాజాలలో పెర్ఫామర్ గా నిరూపించుకున్నాడు. భారతదేశంలో అత్యంత పాపులర్ టీవీ నటులలో ఒకడిగా ఎదిగాడు. అయితే స్టడీస్‌లో అంతంతమాత్రమేనట. ఈ విషయాన్ని ఆయనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. తన ఇంజనీరింగ్ కాలేజ్ రోజుల్లో ఓ పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేదని చెప్పాడు. రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో టెలికాం ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు పరీక్షలలో ఫెయిలైన తర్వాత చాలా డిప్రెషన్ కి గురయ్యాడట. ఒకానొక దశలో ఆత్మహత్య చేసుకోవాలని భావించాడట. ఆ తర్వాత ధ్యానం బౌద్ధమతం ఆయన జీవితంలో అంతర్భాగంగా మారాయి. అవి నిజంగా జీవితంపై తన దృక్పథాన్ని మార్చాయని చెప్పాడు. చాలా కష్టమైన సమయాన్ని ఎదుర్కొంటున్నప్పుడు బౌద్ధమతాన్ని స్వీకరించినట్లు, ఆ సమయంలో మంత్రాలు జపించినట్లు వెల్లడించాడు.



## చెర్రీతో కనకవతి?

నిఖిల్ సిద్ధార్థ్ 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ముద్దుగుమ్మ రుక్మిణీ వసంత్.. ఈ ఏడాది 'కాంతార: చాప్టర్ 1' సినిమాలో లీడ్ రోల్ పోషించి, ఏకంగా పాన్ ఇండియా సెలబ్రిటీ అయిపోయింది. ఇప్పుడు ప్రశాంత్ నీల్, యంగ్‌టైగర్ ఎన్టీఆర్ కాంబోలో వస్తున్న (డ్రాగన్) మూవీలో హీరోయిన్ గా నటిస్తోంది. దీంతో పాటు ఈ బ్యూటీ మరో లక్కీ చాన్స్ కొట్టేసింది. ఏకంగా గ్లోబల్ స్టార్ మూవీలో అవకాశం దక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం రుక్మిణీ.. చెర్రీ,సుకుమార్ సినిమాలో హీరోయిన్ గా చేయనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే సమ్మర్‌లో ఈ మూవీ స్టార్ట్ అయ్యే చాన్సుంది. ఇక దీనిపై అధికారిక ప్రకటన వచ్చేవరకు ఎదురుచూడాల్సిందే. ప్రస్తుతం రామ్ చరణ్ 'పెద్ది' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. కాగా తెలుగులో చరణ్, తారక్ నటన అంటే తనకు ఇష్టమని ఓ ఈవెంట్ లో రుక్మిణీ చెప్పిన మాటలను ఫ్యాన్స్ గుర్తు చేసుకుంటున్నారు.







## 2025 టాప్‌లో 'ధురంధర్'.. రూ.1000కోట్ల క్లబ్‌లో చేరిన చిత్రం

రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన 'ధురంధర్' ఊహించని విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోన్న ఈ చిత్రం ఇప్పుడు మరో మైలురాయిని చేరుకొని ఏకంగా రూ.1000 కోట్ల మార్క్‌ను దాటేసింది. అలాగే, 2025లో భారత్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగానూ నిలిచింది. తొలి రోజు నుంచే కలెక్షన్లలో టాప్‌లో కొనసాగుతోన్న 'ధురంధర్' 21వ రోజు రూ.26 కోట్లను సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా ఇప్పటి వరకూ రూ.1006కోట్లు వసూలు చేసింది. 21వ రోజు కూడా ప్రపంచవ్యాప్తంగా 4,753 థియేటర్‌లలో విజయవంతంగా అలరించింది. భారత్‌లో రూ.668 కోట్లు వసూళ్లు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో ఇప్పటి వరకూ ఉన్న పలు బ్లాక్‌బస్టర్ చిత్రాల రికార్డులను ఇది అధిగమించింది. స్త్రీ 2 (రూ.598 కోట్లు), ఛావా (రూ.601 కోట్లు)లను బీట్ చేసి టాప్ వన్‌లోకి వచ్చేసింది. దర్శకుడు ఆదిత్య ధర్ కెరీర్‌తో పాటు నటుడు రణ్‌వీర్ సింగ్ కెరీర్‌లోనూ అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచింది. మరోవైపు 'ధురంధర్ 2' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న సీక్వెల్ విడుదల కానుంది. అంతేకాదు, హిందీతో పాటు, దక్షిణాది భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం పార్ట్ 2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.




## రైల్వే స్టాక్స్ దూకుడు..
# RVNL 12 శాతం జంప్



రైల్వే సంబంధిత స్టాక్స్‌లో ర్యాలీ కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా ఈ స్టాక్స్ పెరుగుతుండగా.. శుక్రవారమూ ఆ పరుగు కొనసాగింది. రైల్వే సంబంధిత ప్రధాన స్టాక్స్ అయిన రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (RVNL), ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (IRFC), ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC), రైల్‌టెల్ స్టాక్స్ రాణిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి ఆర్‌వీఎన్ఎల్ స్టాక్ ఎన్ఎస్ఈలో 12.58 శాతం లాభంతో రూ.389.20 వద్ద కొనసాగుతోంది. ఐఆర్ఎఫ్‌సీ 9.27 శాతం, ఐఆర్‌సీటీసీ 4.59 శాతం, జుపిటర్ వ్యాగన్స్ 2.85 శాతం లాభంతో ట్రేడవుతున్నాయి.సవరించిన రైల్వే ఛార్జీలు నేటి నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రైల్వే స్టాక్స్ రాణిస్తున్నాయని అనలిస్టులు చెబుతున్నారు. రైల్వే ఛార్జీలు పెంచడం ఈ ఏడాది ఇది రెండోసారి. తాజా పెంపుతో 202526 ఆర్థిక సంవత్సరంలో రైల్వేకు రూ.600 కోట్లు అదనంగా ఆదాయం సమకూరనుంది. ఈ పెంపు సెక్టార్ వృద్ధికి దోహదం చేస్తుందని భావిస్తున్నారు. ఛార్జీల పెంపు వల్ల ప్రత్యక్షంగా ఆయా కంపెనీలకు ప్రయోజనం చేకూరకపోయినా, రైల్వే ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే పరోక్షంగా లబ్ధి చేకూరుతుందన్న అంచనాలతో ఈ దూకుడు కొనసాగుతోంది. దీనికి తోడు 202627 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రైల్వేకు సంబంధించి పెద్దఎత్తున ప్రకటనలు ఉండొచ్చన్న అంచనాలు కూడా మరో కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు.

**పెరిగిన రైల్వే ఛార్జీలు**

నేటి నుంచి పెరిగిన రైల్వే ఛార్జీలు అమల్లోకి వచ్చాయి. 215 కిలోమీటర్ల దూరానికి పైబడిన ప్రయాణానికి కిలోమీటరుకు గరిష్ఠంగా 2 పైసలు చొప్పున ధరలు పెంచారు. నాన్‌మెయిల్/నాన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో స్లీపర్, సాధారణ క్లాస్, ఏసీ తరగతుల్లో కిలోమీటరుకు 1 పైసా; మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ, నాన్ ఏసీ తరగతుల్లో ప్రతి కిలోమీటరుకు 2 పైసలు పెంచుతున్నట్లు రైల్వే శాఖ వెల్లడించింది. సబర్బన్, నెలవారీ సీజన్ టికెట్లు, ఆర్డినరీ క్లాస్‌లో 215 కిలోమీటర్ల దూరాన్ని ధరల పెంపు నుంచి మినహాయించింది.

## కంపెనీ అమ్మేసి..
# ఉద్యోగులకు రూ.2వేల కోట్ల బోనస్..!



క్రిస్మస్ వేళ తన ఉద్యోగులకు ఓ సీఈఓ భారీ సర్‌ప్రైజ్ ఇచ్చారు. రూ.2000కోట్ల బోనస్‌ను కేటాయించారు. 540 మంది ఉద్యోగులకు ఈ మొత్తం అందేలా చూశారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం. అమెరికా లోని లూసియానా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోన్న ఫైబర్‌బాండ్ సంస్థ కు గ్రాహమ్ వాకర్ సీఈఓగా వ్యవహరిస్తున్నారు. తన తండ్రి స్థాపించిన ఈ నిర్మాణ రంగ కంపెనీని 1.7 బిలియన్ డాలర్లకు ఇటీవల విక్రయించారు. ఈ విక్రయానికి ముందే కొనుగోలుదారైన ఈటన్ సంస్థకు ఒక కండీషన్ పెట్టారు. 15 శాతం వాటా (సుమారు రూ.2వేల కోట్లు)ను కొన్నేళ్లుగా ఈ సంస్థలోనే కొనసాగుతోన్న 540 మంది ఉద్యోగులకు కేటాయించాలని స్పష్టంగా చెప్పారు. అందుకు ఈటన్ అంగీకరించడంతో రానున్న ఐదేళ్ల కాలంలో ఆ సిబ్బంది ఒక్కొక్కరికీ రూ.4 కోట్ల మేర అందనుంది. ఇప్పటికే అది వారి ఖాతాల్లో జమ కావడం ప్రారంభమైంది. ఆ ఉద్యోగులు కొత్త యాజమాన్యం కింద దీర్ఘకాలం ఉద్యోగంలో కొనసాగితే... వారికి అందే మొత్తం ఇంకా పెరగనుంది. తొలుత ఈ వార్తను ఎవరూ నమ్మలేదు. ''ఇదంతా ఆశ్చర్యంగా అనిపించింది. ఇది మాకు లాటరీనే'' అని బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తోన్న హెక్టర్ మొరెనో పేర్కొన్నారు. 1995 నుంచి ఆ సంస్థలో పనిచేస్తోన్న లేసియాకే.. తమకు కేటాయించిన మొత్తం గురించి తెలుసుకొని ఉద్వేగానికి గురయ్యారు. ఈ డబ్బుతో తన అప్పులు తీర్చుకుంటానని చెప్పారు. ఇలా ఉద్యోగులు ఒక్కోలా తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. గ్రాహమ్ తండ్రి క్లాడ్ వాకర్ ఈ ఫైబర్‌బాండ్ సంస్థను 1982లో స్థాపించారు. డిసెంబర్ 31న సీఈఓ పదవి నుంచి గ్రాహమ్ దిగిపోనున్నారు. ప్రస్తుతం ఈ బోనస్ వార్త నెట్టింట్లో వైరల్ అవుతోంది. ''ఇది మంచి క్రిస్మస్ స్టోరీ. ఇలాంటి పెట్టుబడిదారీ విధానం మనకు చాలా అవసరం. ఈ బాస్ తన ఉద్యోగుల్ని కుటుంబంలా భావించారు'' అని నెటిజన్లు స్పందిస్తున్నారు.

# టాటా స్టీల్‌పై రూ.14 వేల కోట్లకు డచ్ ఎన్జీవో దావా





టాటా గ్రూప్‌నకు చెందిన టాటా స్టీల్ నెదర్లాండ్ యూనిట్‌పై డచ్‌కు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ దావా వేసింది. నెదర్లాండ్స్‌లోని ఆ కంపెనీ కార్యకలాపాల కారణంగా స్థానికుల ఆరోగ్యంపై ప్రభావం, పర్యావరణ పరంగానూ నష్టం పేరిట న్యాయపోరాటానికి దిగింది. దీనికి పరిహారంగా 1.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ.14,370 కోట్లు) చెల్లించాలని హోర్లెంలోని నార్త్ హోలెండ్ డిస్ట్రిక్ట్ కోర్టులో దావా వేసింది. ఈ విషయాన్ని టాటా స్టీల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేసింది. నెదర్లాండ్స్‌లోని వెల్సన్‌నూర్డ్‌లో నిర్వహిస్తున్న టాటా స్టీల్ ఐజ్మయిడన్ బీవీ నుంచి వెలువడే కాలుష్యకారకాల వల్ల స్థానికులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని పేర్కొంటూ సదరు ఎన్జీవో దావా వేసినట్లు టాటా స్టీల్ పేర్కొంది. స్థానికులు ఇంట్లో ఆనందకర క్షణాలు గడపలేకపోతున్నారని, వారి ఆస్తుల విలువ కూడా పడిపోయిందనేది ఎన్జీవో వాదన. అయితే, ఎన్జీవో వాదనలకు బలం చేకూర్చే ఆధారాలేవీ లేవని టాటా స్టీల్ పేర్కొంది. ఈ విషయంలో అనుకూలంగా బలమైన ఆధారాలు ఉన్నాయని తన రెగ్యులేటరీ ఫైలింగ్ తెలిపింది. రెండు దశల్లో దీనిపై వాదనలు జరుగుతాయని, ఒక్కో దశ పూర్తవ్వడానికి కనీసం రెండు మూడేళ్లయినా పడుతుందని పేర్కొంది. కాబట్టి పరిహారం అనే ప్రశ్న ఇప్పటికిప్పుడు ఉత్పన్నం కాదని స్పష్టం చేసింది. మరోవైపు డచ్ ప్రభుత్వంతో కలిసి పర్యావరణ కాలుష్యం అదుపునకు చర్యలు మొదలుపెట్టినట్లు పేర్కొంది.

# ఆటో, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాలు.. నష్టాలతో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి మిశ్రమ సంకేతాలకు తోడు, సూచీలను ముందుకు నడిపించే అంశాలేవీ లేకపోవడం విక్రయాలు కొనసాగాయి. ముఖ్యంగా ఐటీ, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల కారణంగా సూచీలు ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఏడాది చివర కావడంతో ట్రేడింగ్ యాక్టివిటీ అంతంత మాత్రంగానే ఉంది. ఈ క్రమంలోనే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.1 లక్ష కోట్లు క్షీణించి రూ.474 లక్షల కోట్లకు పరిమితమైంది. సెన్సెక్స్ ఉదయం 85,225.28 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 85,408.70) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 84,937.82 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 367.25 పాయింట్ల నష్టంతో 85,041.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 99.80 పాయింట్ల వద్ద 26,042.30 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 89.86గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఎటెర్నల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. టైటాన్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.31 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,517 డాలర్ల ట్రేడవుతోంది.

## 110 పరుగులకే కుప్పకూలిన ఇంగ్లాండ్..
# ఒక్క రోజే 20 వికెట్లు డౌన్



యాషెస్ సిరీస్‌లో భాగంగా మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ తన తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 29.5 ఓవర్లలోనే 110 పరుగులకు కుప్పకూలింది. 42 పరుగుల వెనకంజలో ఉంది. ఈ మ్యాచ్‌లో ఆసీస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ (41 పరుగులు; 34 బంతుల్లో, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్కడే రాణించాడు. గస్ అట్కిన్సన్ (28 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. జో రూట్ (0), బెన్‌స్టోక్స్ (16), జెమ్మీ స్మిత్ సహా మిగతా వారంతా వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆసీస్ బౌలర్లలో మైఖేల్ నెసర్ 4, స్కాట్ బోల్యాండ్ 3, మిచెల్ స్టార్క్ 2, కామెరూన్ గ్రీన్ ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్.. తొలి రోజు ఆటముగిసే సమయానికి ఒక ఓవర్‌కు వికెట్ నష్టపోకుండా 4 పరుగులు చేసింది. ట్రావిస్ హెడ్ (0*), స్కాట్ బోల్యాండ్ (4*) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం ఆ జట్టు 46 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఈ మ్యాచ్‌లో ఒక్క రోజులోనే 20 వికెట్లు పడటం గమనార్హం. ఇరు జట్లలో ఏ ఒక్క బ్యాటర్ కూడా కనీసం హాఫ్ సెంచరీ చేయలేకపోయాడు.

## విజయ్ హజారే ట్రోఫీ
# రింకు సింగ్ అజేయ సెంచరీ.. విరాట్, పంత్ అర్ధశతకాలు



విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా రాజ్‌కోట్ వేదికగా ఉత్తరప్రదేశ్, చండీగఢ్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చండీగఢ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరప్రదేశ్.. నిర్ణీత 50 ఓవర్లకు 4 వికెట్లు నష్టపోయి 367 పరుగులు చేసింది. ఆర్యన్ జుయల్ (134; 118 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లు), రింకు సింగ్ (106*, 60 బంతుల్లో, 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలతో చెలరేగిపోయారు. ధ్రువ్ జురెల్ హాఫ్ సెంచరీ (67; 57 బంతుల్లో, 11 ఫోర్లు) సాధించాడు. చండీగఢ్ బౌలర్లలో తరణ్‌ప్రీత్ సింగ్ 2, నిశుంక్ బిర్లా, సందీప్ శర్మ తలో వికెట్ తీసుకున్నారు. జైపూర్ వేదికగా ఉత్తరాఖండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 50 ఓవర్లలో ఆ జట్టు 7 వికెట్ల నష్టానికి 331 పరుగులు సాధించింది. గత మ్యాచ్‌లో సెంచరీతో ఆకట్టుకున్న రోహిత్ శర్మ ఇన్నింగ్స్ తొలి బంతికే డకౌట్‌గా వెనుదిరిగాడు. హార్దిక్ తామోర్ (93) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. సర్ఫరాజ్ ఖాన్ (55), అతడి సోదరుడు ముషీర్ ఖాన్ (55) అర్ధశతకాలు చేశారు. బెంగళూరు వేదికగా గుజరాత్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ మొదట బ్యాటింగ్ చేసింది. 50 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి 254 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (77; 61 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్), రిషభ్ పంత్ (70; 79 బంతుల్లో, 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో రాణించారు.




# ఆర్సీబీ కల నెరవేరినా.. కలత తప్పలేదు!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర దించుతూ ఐపీఎల్ టైటిల్‌ను 2025లోనే కైవసం చేసుకుంది. అహ్మదాబాద్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 6 పరుగుల తేడాతో విజయం సాధించి తన కలల కప్పును కైవసం చేసుకుంది. అయితే ఆ ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించే లోపే.. బెంగళూరు తొక్కిసలాట ఘటన చోటు చేసుకుంది. దీంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.

*** తీవ్ర విషాదం నింపిన విజయోత్సవ ర్యాలీ..**

ఫైనల్ మ్యాచ్ జూన్ 3న జరిగితే.. మరుసటి రోజే జూన్ 4న బెంగళూరులో విజయోత్సవ పరేడ్‌ను నిర్వహించారు. అయితే నిర్వాహకుల ప్రణాళిక, సమన్వయ లోపం వల్ల గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా విజయోత్సవ ర్యాలీ ఉంటుందని ఒకసారి, ఉండదని మరోసారి వార్తలు రావడంతో అభిమానులు తికమక పడ్డారు. వర్షం కూడా పరిస్థితిని మరింత జఠిలంగా మార్చింది! అభిమానులంతా ఒక్కసారిగా చిన్నస్వామి స్టేడియం వద్దకు చేరుకోవడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 50 మందికి పైగా గాయాలపాలయ్యారు.

*** సోషల్ మీడియాలో తీవ్ర చర్చోపచర్చలు!**

కర్ణాటక హైకోర్టు బెంగళూరు తొక్కిసలాట ఘటనను సుమోటోగా స్వీకరించింది. ఈ నేపథ్యంలోనే న్యాయస్థానం సూచనతో రాష్ట్ర ప్రభుత్వం.. సీఐడీ పోలీసులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసి విచారణ జరిపించింది. అప్పట్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సొసాలేను కూడా పోలీసులు అరెస్టు చేశారు. అలాగే విజయోత్సవ ఈవెంట్ నిర్వాహక సంస్థకు చెందిన ముగ్గురు సిబ్బందినీ వారు అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియాలోనూ ఈ దుర్ఘటనకు సంబంధించి తీవ్ర చర్చోపచర్చలు జరిగాయి.

**ఇప్పటికీ వెంటాడుతున్న వైనం!**

నాడు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన దుర్ఘటనకు సంబంధించిన చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. భద్రతాలోపాల వల్ల ప్రస్తుతం ఆ మైదానంలో క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా బుధవారం విజయ్‌హజారే ట్రోఫీలో భాగంగా దిల్లీ, ఆంధ్ర మధ్య మ్యాచ్ నిజానికి చిన్నస్వామి స్టేడియంలో నిర్వహించాలని కర్ణాటక క్రికెట్ అసోషియేషన్ భావించింది. కానీ.. భద్రత కారణాల వల్ల కర్ణాటక ప్రభుత్వం నుంచి అనుమతి లభించలేదు. కనీసం ప్రేక్షకులు లేకుండా మ్యాచ్ నిర్వహించడాన్నీ సాహసంగానే పరిగణించింది! దీంతో ఆ మ్యాచ్‌ను కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోషియేషన్.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గ్రౌండ్ 1లో జరిపించింది. అక్కడ కూడా ప్రేక్షకులకు అనుమతి ఇవ్వకుండానే బీసీసీఐ మ్యాచ్ నిర్వహించింది. దీనికి తోడు.. లైవ్ ప్రసారాలూ లేకపోవడంతో, దిల్లీ తరపున ఆడుతున్న విరాట్ కోహ్లీని వీక్షించాలనుకున్న అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. మైదానం చుట్టుపక్కల ఉన్న చెట్లపైకి ఎక్కి కొందరు ఫ్యాన్స్ మ్యాచ్‌ను చూడాల్సి వచ్చింది.

# అలోవేరా జెల్ రాస్తే నల్లని వలయాలు తగ్గుతాయా..



**అలోవేరాతో ఎన్నో లాభాలు చర్మానికి మేలు చేస్తుందంటున్న నిపుణులు**

**ఆయుర్వేద గుణాలు ఉండే అలోవెరా వల్ల చాలా ప్రయోజనాలు మనకి లభిస్తాయి. పైగా అలోవెరా మన ఇంట్లోనే దొరుకుతుంది. దీని కోసం మనం పెద్దగా కష్ట పడక్కర్లేదు కూడా. అలోవెరాని అప్లై చేసుకోగానే ఎంతో చల్లగా ఉంటుంది. అదే విధంగా ఎన్నో చర్మ సమస్యలను అది పోగొడుతుంది. యాక్నే మొదలు చర్మం రంగు మార్చడం వరకు ఎన్నో ప్రయోజనాలు కలబందతో మనకి వస్తాయి. చర్మ సమస్యలకు నిజంగా అద్భుతమైన పదార్థం అని చెప్పొచ్చు. అయితే చాలా మంది అలోవెరాని ఎక్కువగా ఉపయోగిస్తూ ఉంటారు. కానీ దీని వల్ల కలిగే లాభాల గురించి తెలియదు. మరి ఆలస్యం ఎందుకు వాటి కోసం చూద్దాం.**

అలోవెరా ఉపయోగించడం వల్ల చర్మం, జుట్టు కూడా ఎంతో అందంగా మారుతుంది. అలోవెరా జ్యూస్‌ని కూడా చాలా మంది తాగుతూ ఉంటారు. దీని వల్ల పలు రకాల అనారోగ్య సమస్యలు తగ్గిపోతాయి. ఇలా ఒకటి కాదు రెండు కాదు కలబందతో ఎన్నో ప్రయోజనాలు మనం పొందొచ్చు. ఇక వాటి కోసం చూస్తే...

**కంటి క్రీమ్‌లా:**

డార్క్ సర్కిల్స్‌తో చాలా మంది ఇబ్బంది పడుతూ ఉంటారు. మీరు కూడా డార్క్ సర్కిల్స్‌తో ఇబ్బంది పడుతున్నారా..? అయితే తప్పకుండా కలబందని ఉపయోగించండి. అయితే ఈ డార్క్ సర్కిల్స్ ఎలా వస్తాయి అనేది చూస్తే.. డార్క్ సర్కిల్స్ అనేవి ఒత్తిడి, నిద్ర లేక పోవడం మరియు ఎక్కువ కెఫిన్ తీసుకోవడం కారణంగా వస్తాయి.

అటువంటి వాళ్లు డార్క్ సర్కిల్స్ పోవడానికి అలోవెరా గుజ్జుని అప్లై చేసుకోండి. దీంతో ఈజీగా ఈ సమస్య నుండి బయట పడిపోవచ్చు. దీని కోసం మీరు రాత్రి నిద్రపోయే ముందు కలబంద మట్ట తీసుకుని దాని నుండి గుజ్జు తీసి... మీ డార్క్ సర్కిల్స్‌పైన అప్లై చేయండి. అయితే ఇలా అప్లై చేసిన తర్వాత వెంటనే కడిగేసుకోకుండా. రాత్రంతా అలానే వదిలేయండి. ఆ తర్వాత ఉదయాన్నే వాష్ చేయండి. ఇలా చేయడం వల్ల డార్క్ సర్కిల్స్ మాయమైపోతాయి. కాబట్టి ఈ చిన్న చిట్కాని పాటిస్తే త్వరగా డార్క్ సర్కిల్స్ బాధ నుండి బయట పడిపోవచ్చు.

**పిగ్మెంటేషన్ తగ్గిస్తుంది :**

అలోవెరాని ఉపయోగించడం వల్ల చర్మం అందంగా మారుతుంది. రంగు మారడానికి కూడా మీరు గమనించవచ్చు. అయితే దీని కోసం మీరు ఏం చేయాలంటే..? అలోవెరా గుజ్జు ముఖం మీద అప్లై చేయండి. దీనితో మీ చర్మం కాస్త తెల్లగా మారుతుంది. దీని కోసం మీరు రాత్రి పూట కలబంద గుజ్జు రాసుకుని ఉదయం కడిగేసుకుంటే మంచిది అని నిపుణులు సూచిస్తున్నారు.

కనుక నిద్రపోయే ముందు కలబంద కొమ్మని తీసుకుని దానిలో నుండి గుజ్జు తీసేసి దానిని ముఖానికి అప్లై చేయండి. రాత్రంతా అలానే వదిలేసి ఉదయాన్నే గోరు వెచ్చని నీటితో ముఖాన్ని కడిగేయండి. ఈ విధంగా రెండు నుండి మూడు సార్లు వారానికి చేస్తూ ఉండండి. దీంతో మీకు చక్కని పరిష్కారం కనబడుతుంది.



# వేసుకునే మందులు అసలా.. నకిలీనా.. ఇలా తెలుసుకోండి..

**ఈ రోజుల్లో ఆరోగ్యంగా ఉండటం చాలా అవసరం. ఆరోగ్యంగా ఉండాలంటే చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆరోగ్యంగా ఉండటం కోసం చాలా మంది వాళ్ళ డైట్‌లో సప్లిమెంట్లను తీసుకుంటున్నారు. అయితే ఈ రోజుల్లో చాలా రకాల డైట్ సప్లిమెంట్స్ మార్కెట్‌లో మనం చూస్తున్నాం. అయితే వాటిలో నిజమైనవి ఏవి ...?, ఫేక్ సప్లిమెంట్స్ ఏవి..? ఎలా కనుక్కోవాలి ఇలా అనేక ఈ విషయాలను తెలుసుకుందాం. మరి ఆలస్యం ఎందుకు వాటి కోసం చూసేయండి.**

దీంతో మీకు ఫేక్ సప్లిమెంట్స్‌కి నిజమైన సప్లిమెంట్‌కి తేడా ఎలా తెలుస్తుంది..?, ఫేక్ సప్లిమెంట్స్‌ని బ్యాన్ చేసిన స్టెరాయిడ్స్ వంటి హానికరమైన కెమికల్స్ మరియు స్పురియస్ పదార్థాలు వంటివి ఉంటాయి. కానీ మామూలు వాటి లాగే రంగు, గుణం ఉంటుంది. వీటి వల్ల ఒంట్లో పర్మినెంట్ డ్యామేజ్ అవుతుంది. చాలా మంచి క్వాలిటీ సప్లిమెంట్స్ ఇప్పుడు మార్కెట్‌లో ఉంటున్నాయి పైగా వాటి రేట్లు కూడా చాలా ఎక్కువగా ఉంటున్నాయి. మార్కెట్‌లో ఎన్నో రకాల ప్రొడక్ట్స్ మనకు దొరుకుతున్నాయి. కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండాలి. కనుక ఏమాత్రం చిన్న పొరపాటు చేసినా సరే ఫేక్ ప్రొడక్ట్స్ వలన ఇబ్బందులు వస్తాయి. కాబట్టి నిజమైన ప్రొడక్ట్ ఫేక్ ప్రొడక్ట్స్‌కి మధ్య తేడాని గమనించండి. మన కోసం నిపుణులు కొన్ని విషయాలను చెప్పారు. వాటి కోసం మీరు చూశారంటే ఫేక్ ప్రొడక్ట్స్ కోసం మీరు తెలుసుకోవచ్చు. మరి ఇప్పుడు వాటిని చూడండి.

**బార్ కోడ్స్‌ని చూడండి:**

ఇప్పటి కాలంలో చాలా మంది స్మార్ట్ ఫోన్‌ని వాడుతున్నారు. పైగా దానిలో అనేక రకాల ఆప్స్ కూడా ఉపయోగించవచ్చు. బార్ కోడ్స్, క్యూఆర్ కోడ్ వంటివి చూడడానికి ప్రత్యేకమైన యాప్స్ ఉంటాయి. మీరు వాటిని స్కాన్ చేసి వాటి వివరాలను చదవవచ్చు.

ఇలా బార్ కోడ్ ద్వారా మీరు అప్పుడే నిజమైన ప్రొడక్ట్స్ ఆ ఫేక్ ప్రొడక్ట్స్ ఆ అనేది తెలుసుకోవచ్చు కాబట్టి ఈసారి ఎప్పుడైనా గమనించండి.

**ప్యాకేజ్ మరియు సీల్‌ని చూడండి:**

మీరు కనుక ప్రొడక్ట్ బయట ఉండే ప్యాకేజ్ మరియు సీల్‌ని చూశారంటే అప్పుడు మీకు కొన్ని స్పెల్లింగ్ మిస్టేక్ లేదా సరైన ఫాంట్ ఉపయోగించని పదాలు వంటివి కనబడుతూ ఉంటాయి. కాబట్టి మీరు ఏదైనా ప్రొడక్ట్స్‌ని కొనుగోలు చేశారంటే తప్పకుండా ప్రొడక్ట్స్ కోసం వివరంగా చూడండి. దీనితో మీకు నిజమైన ప్రొడక్ట్ అవునో కాదో తెలిసిపోతుంది.





**సిట్రస్ ఫ్రూట్స్ ఆరోగ్యానికి మంచివి. కానీ, వీటిని టీతో కలిపి తీసుకోవడం అంతమంచిది కాదు. ఎందుకంటే టీలోని టానిన్స్.. సిట్రస్ ఫ్రూట్స్‌లోని అసిడిటీతో క్లాష్ అవుతాయి. దీంతో ఇది మెటాలిక్ టేస్ట్ రావడం, చేదుగా అనిపించడం జరుగుతుంది. ఈ అసిడిటీ కారణంగా కడుపు సమస్యలు కూడా వస్తాయి. అందుకే, నారింజ, నిమ్మకాయల వంటి ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. దీంతో కడుపునొప్పి, పేగు సమస్యలు రావు.**

# అగరుబత్తీలపై కేంద్రం కొత్త ప్రమాణాలు... వినియోగదారుల భద్రతే లక్ష్యం

ఢిల్లీ, డిసెంబర్ 26 (భారత శక్తి): దేశంలో అగరుబత్తీల (ధూప్ స్టిక్స్) నాణ్యత, భద్రతను పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారుల ఆరోగ్యం, పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కొత్త ప్రమాణాలను విడుదల చేసింది. 'జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025' సందర్భంగా శుక్రవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి "ఐఎస్ 19412:2025 - అగరుబత్తీల స్పెసిఫికేషన్" పేరుతో ఈ నూతన ప్రమాణాలను ఆవిష్కరించారు. ఈ కొత్త నిబంధనల ప్రకారం, అగరుబత్తీల తయారీలో పలు హానికరమైన పురుగుమందులు, సింథటిక్ సువాసనల వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. అలత్రిన్, పెర్మెత్రిన్, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి పురుగుమందులతో పాటు బెంజైల్ సైనైడ్, ఇథైల్ అక్రిలేట్ వంటి రసాయనాల వాడకంపై ఆంక్షలు విధించారు. వీటిలో చాలా రసాయనాలు మానవ ఆరోగ్యం, గాలి నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని అంతర్జాతీయంగా నిషేధంలో ఉన్నాయి. ప్రపంచంలోనే అగరుబత్తీల ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. దేశంలో ఏటా రూ. 8,000 కోట్ల పరిశ్రమ ఉండగా, సుమారు 150 దేశాలకు రూ. 1,200 కోట్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఈ రంగం గ్రామీణ ప్రాంతాల్లోని ఎందరో చేతివృత్తుల వారికి, మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. కొత్త ప్రమాణాల ప్రకారం అగరుబత్తీలను యంత్ర నిర్మిత, చేతితో తయారు చేసినవి, సాంప్రదాయ మసాలా రకాలుగా వర్గీకరించారు. ముడిసరుకులు, మండే విధానం, సువాసన వంటి అంశాల్లో నాణ్యతను నిర్దేశించారు. ఈ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ఉత్పత్తులకు 'బీఐఎస్ స్టాండర్డ్ మార్క్' లభిస్తుంది. దీనివల్ల వినియోగదారులు నాణ్యమైన, సురక్షితమైన ఉత్పత్తులను సులభంగా గుర్తించవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ నిర్ణయం వినియోగదారుల నమ్మకాన్ని పెంచడంతో పాటు, భారత అగరుబత్తీలకు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత ఆదరణ లభిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## కీలక నేతలతో కేసీఆర్ భేటీ..
## గరంగరంగా తెలంగాణ రాజకీయం

హైదరాబాద్, డిసెంబర్ 26 (భారత శక్తి):తెలంగాణలో రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ యాక్టివ్ మోడ్‌లోకి వెళ్లారు. వరుస సమావేశాలు, నేతలతో మంతనాలు, వ్యూహాత్మక నిర్ణయాలతో ఆయన రాజకీయాల్లో దూకుడు పెంచుతున్నారు. ముఖ్యంగా శాసనసభ సమావేశాలు సమీపిస్తున్న వేళ, పార్టీని మళ్లీ పోరాటానికి సిద్ధం చేసే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ ఈరోజు కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ తరఫున అనుసరించాల్సిన వ్యూహం, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఎలా ఎదురుదాడి చేయాలన్న అంశాలపై కేసీఆర్ స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అలాగే రానున్న రోజుల్లో నిర్వహించాల్సిన బహిరంగ సభలు, నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల తేదీలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి మరింత బలంగా వెళ్లాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కేసీఆర్ నేతలకు సూచించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇదే సమయంలో మరో కీలక పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయాలన్న దిశగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును తుది దశకు తీసుకెళ్లాలంటే కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావును కూడా విచారించాల్సిన అవసరం ఉందని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కేసీఆర్, హరీశ్ రావులకు త్వరలో సమన్లు జారీ చేసి విచారణ చేపట్టాలని సిట్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే శాసనసభ సమావేశాల సమయంలో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో, సమావేశాలు ముగిసిన తర్వాత నోటీసులు ఇవ్వాలని నిర్ణయించినట్లు టాక్ నడుస్తోంది. ఈ మొత్తం పరిణామాల మధ్య కేసీఆర్ రాజకీయంగా వేగం పెంచడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఒకవైపు ప్రభుత్వంపై దాడికి సిద్ధమవుతూ, మరోవైపు న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే వ్యూహంతో ఆయన ముందుకు సాగుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయన్న సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి.

## రైతు భరోసాకు కొత్త రూల్స్..
## ఇకపై సాగు చేసేవారికే పెట్టుబడి సాయం

హైదరాబాద్, డిసెంబర్ 26 (భారత శక్తి):తెలంగాణ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించేందుకు సిద్ధమవుతోంది. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని సంక్రాంతి పండుగ కానుకగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. అయితే, ఈసారి పథకం అమలులో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. కేవలం పంటలు సాగు చేసే నిజమైన రైతులకే ప్రయోజనం చేకూరేలా పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. గతంలో సాగు చేయని భూములకు కూడా నిధులు అందుతున్నాయన్న విమర్శల నేపథ్యంలో, ఈసారి ప్రభుత్వం టెక్నాలజీ సాయం తీసుకుంటోంది. ఉపగ్రహ చిత్రాల ద్వారా వ్యవసాయ భూములను క్షుణ్ణంగా పరిశీలించి, డిజిటల్ మ్యాపింగ్ ద్వారా ఏ పొలంలో పంట ఉందో, ఏది ఖాళీగా ఉందో గుర్తిస్తున్నారు. దీనివల్ల సాగులో లేని బంజరు భూములు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా నిలిచిపోనుంది. ఈ చర్యతో ప్రభుత్వ ఖజానాపై భారం తగ్గడమే కాకుండా, అర్హులైన రైతులకే లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం ఈ పథకానికి రూ. 18,000 కోట్లు కేటాయించింది. గత వానాకాలం సీజన్‌లో సుమారు 69 లక్షల మంది రైతులకు రూ. 9,000 కోట్లను కేవలం 9 రోజుల్లోనే జమ చేసింది. ఇప్పుడు యాసంగికి కూడా జనవరి రెండో వారం నాటికి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, పండుగలోపు నిధులు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ప్రాచీన విజ్ఞానానికి భారత్ పుట్టినిల్లు: సీఎం

తిరుమల, డిసెంబర్ 26 (భారత శక్తి):భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, దేశ ప్రాచీన వైభవాన్ని, విజ్ఞాన ఘనతను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. దేశం, భారతీయత గురించి చర్చించుకోవడానికి ఇది సరైన వేదిక అని ఆయన అన్నారు. ప్రాచీన కాలంలోనే భారతదేశం విజ్ఞానాన్ని సముపార్జించిన దేశంగా నిలిచిందని చంద్రబాబు గుర్తుచేశారు. "వేల ఏళ్ల క్రితమే హరప్పా నాగరికత ద్వారా అర్బన్ ప్లానింగ్ అంటే ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత మనది. 2900 ఏళ్ల క్రితమే యోగాను అభ్యసించాం. నేడు ప్రధాని మోదీ కృషితో 150 దేశాలు యోగాను పాటిస్తున్నాయి. 2600 ఏళ్ల క్రితమే ఆయుర్వేదం ద్వారా వైద్య సేవలు అందించిన చరిత్ర మనకుంది" అని ఆయన వివరించారు. పూర్వ కాలంలోనే తక్షశిల, నలంద వంటి విశ్వవిద్యాలయాల ద్వారా ఆధునిక విద్యను అందించిన ఘనత భారతదేశానిదని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచానికి సున్నాను పరిచయం చేసింది, మెదడుకు పదునుపెట్టే చదరంగాన్ని కనిపెట్టింది కూడా భారతీయులేనని ఆయన అన్నారు. ఖగోళశాస్త్రంలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరక, ధన్వంతరి, అర్థశాస్త్రంలో కౌటిల్యుడు వంటి మహానుభావులు మనందరికీ స్ఫూర్తి అని చంద్రబాబు పేర్కొన్నారు. వివిధ కీలక రంగాల్లో నైపుణ్యం సాధించిన ఎందరో నిపుణులు మన దేశం సొంతమని ఆయన అన్నారు.

### హెచ్1బీ వీసా అంశంపై
## స్పందించిన భారత్

ఢిల్లీ, డిసెంబర్ 26 (భారత శక్తి):అమెరికా హెచ్ 1బీ వీసా అపాయింట్‌మెంట్‌ల షెడ్యూలింగ్ లేదా రీషెడ్యూలింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఈ విషయాన్ని తాము అమెరికా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినట్లు ఆయన వెల్లడించారు. ఇది అమెరికా సార్వభౌమాధికార పరిధిలోని అంశమే అయినప్పటికీ, తమ ఆందోళనలను అమెరికాకు తెలియజేశామని ఆయన పేర్కొన్నారు. కెనడాలో గుండెపోటు కారణంగా భారత సంతతికి చెందిన వ్యక్తి ఇటీవల మరణించిన ఘటనపై కూడా భారత్ స్పందించింది. మృతుడు భారత సంతతికి చెందిన వ్యక్తి అయినప్పటికీ, అతనికి కెనడా పౌరసత్వం ఉందని స్పష్టం చేసింది. ఈ విషయంలో కెనడా ప్రభుత్వానిదే బాధ్యత అని పేర్కొంది. తీవ్ర ఛాతి నొప్పితో తన భర్తను ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ, చికిత్స కోసం దాదాపు ఎనిమిది గంటలు వేచిచూడాల్సి వచ్చిందని, దీని కారణంగానే తన భర్త ప్రాణాలు కోల్పోయాడని మృతుడి భార్య ఆరోపించారు.

## నేటి నుంచి పెరిగిన రైలు ఛార్జీలు

ఢిల్లీ, డిసెంబర్ 26 (భారత శక్తి):దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులపై కేంద్ర ప్రభుత్వం మరోసారి భారం మోపింది. పెంచిన రైలు ఛార్జీలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ ఏడాది జులైలో ఒకసారి ఛార్జీలు పెంచిన రైల్వే శాఖ, కేవలం ఐదు నెలల వ్యవధిలోనే రెండోసారి ధరలను పెంచడం గమనార్హం. మెయిల్/ఎక్స్‌ప్రెస్, ఏసీ క్లాసులతో పాటు, 215 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించే ఆర్డినరీ నాన్‌ఏసీ క్లాసులపై కూడా ఈ పెంపు ప్రభావం చూపనుంది. అయితే, సబర్బన్ (లోకల్) రైళ్లు, సీజన్ టికెట్లకు ఈ పెంపు నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వడం సామాన్య ప్రయాణికులకు కొంత ఊరటనిచ్చే అంశం.

**పెంపు వెనుక కారణాలివే..**

భారీగా పెరిగిన నిర్వహణ ఖర్చులు, ముఖ్యంగా సిబ్బంది జీతభత్యాలు (రూ.1,15,000 కోట్లు), పెన్షన్ల బిల్లు (రూ.60,000 కోట్లు) భారాన్ని తగ్గించుకునేందుకే ఈ "ఛార్జీల హేతుబద్ధీకరణ" చేపట్టినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పెంపు ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా సుమారు రూ.600 కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ప్రయాణికులపై ఎక్కువ భారం పడకుండా, రైల్వేల ఆర్థిక సుస్థిరతను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఛార్జీలు పెంచినప్పటికీ, ఇప్పటికీ ప్రయాణికుల టికెట్ ధరలో దాదాపు 50 శాతం సబ్సిడీ రూపంలో తామే భరిస్తున్నామని రైల్వే శాఖ పేర్కొంది.

**ఎవరిపై ఎంత భారం?**

రైల్వే బోర్డు జారీ చేసిన కమర్షియల్ సర్క్యులర్ నం. 24 ప్రకారం, ఛార్జీల పెంపు ఇలా ఉంది:
సబర్బన్, సీజన్ టికెట్లు: ఎలాంటి మార్పు లేదు.
ఆర్డినరీ నాన్‌ఏసీ: 215 కిలోమీటర్ల వరకు ప్రయాణించే వారికి పాత ఛార్జీలే వర్తిస్తాయి. ఆ తర్వాత దూర ప్రయాణాలపై శ్లాబుల వారీగా రూ.5 నుంచి రూ.20 వరకు పెంచారు.
స్లీపర్ క్లాస్ (ఆర్డినరీ): కిలోమీటర్‌కు 1 పైసా పెరిగింది.
మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్‌ఏసీ, ఏసీ క్లాసులు): స్లీపర్, ఏసీ చైర్ కార్, ఏసీ 3టైర్, 2టైర్, ఫస్ట్ క్లాస్‌తో పాటు రాజధాని, శతాబ్ది, వందే భారత్ వంటి అన్ని ప్రీమియం రైళ్లలో కిలోమీటర్‌కు 2 పైసల చొప్పున ఛార్జీలు పెరిగాయి.

డిసెంబర్ 26కు ముందే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. రిజర్వేషన్ ఫీజు, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జ్‌లలో ఎలాంటి మార్పులు చేయలేదు.


**ప్రభుత్వంపై విపక్షాల తీవ్ర విమర్శలు**

రైలు ఛార్జీల పెంపుపై విపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందిస్తూ, "మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను దోచుకోవడానికి ఏ అవకాశాన్నీ వదలడం లేదు. బడ్జెట్‌కు కొన్ని రోజుల ముందు, పార్లమెంటులో చర్చ లేకుండా ఛార్జీలు పెంచారు. ప్రత్యేక రైల్వే బడ్జెట్ లేకపోవడంతో జవాబుదారీతనం కనుమరుగైంది" అని విమర్శించారు. రైల్వే భద్రతా వ్యవస్థ 'కవచ్' కేవలం 3% మార్గాలకే పరిమితమైందని, ఇది కేవలం ప్రచారానికే తప్ప ఆచరణలో విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సాధారణ ప్రయాణికుల ప్రయాణం "నరకప్రాయంగా" మారిందని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు.



### బాల పురస్కారం అందుకున్న
## క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ

బీహార్, డిసెంబర్ 26 (భారత శక్తి):బీహార్‌కు చెందిన 14 ఏళ్ల యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. క్రీడల విభాగంలో అతడు కనబరిచిన అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' వరించింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వైభవ్ ఈ పురస్కారాన్ని స్వీకరించాడు. ఈ పురస్కార ప్రదానోత్సవం కారణంగా, వైభవ్ ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో మణిపూర్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. అంతకుముందు అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ 190 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. అవార్డుల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం 7 గంటలకే రాష్ట్రపతి భవన్‌కు హాజరు కావడంతో అతను మ్యాచ్ ఆడలేకపోయాడు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. పురస్కారాలు అందుకున్న చిన్నారులను అభినందించారు. "మీ విజయాలు దేశం మొత్తానికి స్ఫూర్తినిస్తాయి. మీ లాంటి ప్రతిభావంతుల వల్లే భారతదేశం ప్రపంచ వేదికపై వెలుగొందుతోంది" అని ఆమె అన్నారు. వైభవ్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన మరో 19 మంది చిన్నారులు కూడా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కాగా, వైభవ్ ఈ సీజన్‌లో విజయ్ హజారే ట్రోఫీలో ఆడే అవకాశం లేదు. జనవరి 15 నుంచి ప్రారంభం కానున్న అండర్ 19 ప్రపంచకప్ కోసం సన్నద్ధమయ్యేందుకు అతడు త్వరలోనే భారత జట్టుతో చేరనున్నట్లు సమాచారం.



హోటల్ యజమానులు రాజేష్, అభిషేక్ దిల్ సుఖ్ నగర్ క్రోమా సెంటర్ పక్కన ఏర్పాటు చేసిన "ఆర్జె ఫుడ్ సెంటర్"ని కార్పొరేటర్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నాయిని పవన్ కుమార్ లతో కలిసి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు సొంటి చంద్రశేఖర్ రెడ్డి.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు జలంధర్, నరేష్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, డిసెంబర్ 26 (భారత శక్తి ):

## భారత్‌కు ముప్పుగా చైనాపాక్ 'మిలిటరీ బంధం'..

దక్షిణ ఆసియాలో చైనా వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. భారత్‌తో సరిహద్దు వివాదాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, మరోవైపు పాకిస్థాన్‌తో కలిసి భారత్ భద్రతను ప్రభావితం చేస్తోందని అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) తన తాజా నివేదికలో హెచ్చరించింది. కాంగ్రెస్ (అమెరికా పార్లమెంట్)కు సమర్పించిన ఈ వార్షిక నివేదికలో చైనాపాక్ సైనిక భాగస్వామ్యం గురించి కీలక విషయాలను వెల్లడించింది. చైనాకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సైనిక భాగస్వాములలో పాకిస్థాన్ అత్యంత స్థిరమైన, ముఖ్యమైన భాగస్వామి అని నివేదిక పేర్కొంది. ఆయుధాల విక్రయం, ఉమ్మడి ఉత్పత్తి, సైనిక శిక్షణలో చైనా, పాక్ మధ్య సహకారం నిరంతరం పెరుగుతోంది. పాకిస్థాన్ సైనిక ఆధునికీకరణలో చైనా పరికరాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గగనతల, భూతల, నావికా రంగాల్లో అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను చైనా పాక్‌కు బదిలీ చేస్తోందని నివేదిక వివరించింది. చైనాపాక్ సంబంధాల వల్ల భారత్‌కు రెండు వైపుల నుంచి (ఉత్తర, పశ్చిమ సరిహద్దులు) ఒత్తిడి పెరుగుతోందని పెంటగాన్ విశ్లేషించింది. ఏదైనా సంక్షోభం తలెత్తినప్పుడు భారత్ తన రెండు సరిహద్దులను ఏకకాలంలో కాపాడుకోవాల్సిన సవాలు ఎదురవుతుందని హెచ్చరించింది. అక్టోబర్ 2024లో ఎల్ఏసీ (వాస్తవాధీన రేఖ) వెంబడి బలగాల ఉపసంహరణకు చైనా అంగీకరించినప్పటికీ, ఇరు దేశాల మధ్య అపనమ్మకం అలాగే ఉందని నివేదిక స్పష్టం చేసింది. భారత్‌అమెరికా బంధం మరింత బలపడకుండా అడ్డుకోవడానికే చైనా సరిహద్దుల్లో శాంతి చర్చలకు మొగ్గు చూపుతోందని అమెరికా భావిస్తోంది.

# రాష్ట్రానికి గవర్నర్ అయినా మర్చిపోని స్నేహబంధం

హైదరాబాద్, డిసెంబర్ 26 (భారత శక్తి ప్రత్యేక ప్రతినిధి): ఒకరేమో రాష్ట్రానికి గవర్నర్ మరొకరు సీనియర్ పాత్రికేయుడు. పాత పరిచయాలు మర్చిపోకుండా స్నేహితుడి ఇంటికి ప్రత్యేకంగా వెళ్ళి తన మిత్రుడి కుటుంబసభ్యులతో కొంత సమయం గడిపి పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా కాలక్షేపం చేయడం అంటే మామూలు విషయం కాదు కదా. కానీ మాజీ ఎమ్మెల్యే, త్రిపుర రాష్ట్ర గవర్నర్, అయిన ఎన్. ఇంద్రసేనారెడ్డి దృష్టిలో ఇది ఒక మామూలు విషయం. తన మిత్రుడు, సీనియర్ పాత్రికేయుడు అయిన కమలాకర శర్మను హైదరాబాద్ పర్యటనలో భాగంగా వ్యక్తిగతంగా కలసి కాసేపు ముచ్చట్లు పెట్టారు. అలాగే వాళ్ళ కుటుంబసభ్యులను పేరుపేరునా పలకరించి వారితో కాసేపు సమయం గడిపారు. తన పర్యటనను పురస్కరించుకుని అక్కడకు వచ్చిన అందరినీ కలిసి యోగక్షేమాలు అడిగారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయుడు కమలాకర శర్మ, భారతశక్తి ఎడిటర్ కేసారం పెంటారెడ్డి మరియు భారత శక్తి ప్రత్యేక ప్రతినిధి చింతలపాటి శ్రీనివాస్, దేవులపల్లి హరిహర ప్రసాద్ త్రిపుర రాష్ట్ర గవర్నర్ ను శాలువాతో సత్కరించి తిరుపతి బాలాజీ చిత్రపటాన్ని బహుకరించారు.







## అనంతుల సురేందర్ రెడ్డి
# పార్థివ దేహానికి శ్రద్ధాంజలి

ఎల్బీనగర్, డిసెంబర్ 26 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు అనంతుల సురేందర్ రెడ్డి బుధవారం గుండెపోటుతో పరమపదించారు. కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలో వారి పార్థివ దేహానికి రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి నివాళులర్పించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, కుటుంసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, అర్బన్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ చల్లా నరసింహ రెడ్డి ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకేపల్లి సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మొగుళ్ల రాజి రెడ్డి, అనంతుల వినయ్ కుమార్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, కిషోర్ గౌడ్, మంజుల రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్యాల జైపాల్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్ రాష్ట్ర యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, బొర్రా అరుణ్, భాను అస్లాం తదితరులు వారి వెంట ఉన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..
# ఆరా మస్తాన్‌ను రెండోసారి విచారించిన సిట్



హైదరాబాద్, డిసెంబర్ 26 (భారత శక్తి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సాక్షి ఆరా మస్తాన్ సిట్ విచారణ ముగిసింది. రెండున్నర గంటల పాటు మస్తాన్‌ను విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు రెండో సారి ఆయన స్టేట్‌మెంట్‌ను నమోదు చేశారు. విచారణ అనంతరం ఆరా మస్తాన్ మాట్లాడుతూ.. గతంలో తాను చెప్పిన వివరాలనే సిట్ అధికారులు మళ్లీ అడిగారని, తనకు తెలిసిన అన్ని అంశాలను స్పష్టంగా చెప్పానన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు వెల్లడించిన అంశాలను క్రాస్ చెక్ చేసుకునేందుకే తనను మరోసారి విచారణకు పిలిచారని తెలిపారు. సిట్ అధికారులు తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన డేటాను తన ముందే ఉంచారని, ఆ డేటా ప్రకారం 2020 నుంచే తన రెండు ఫోన్లు ట్యాప్ అయినట్లు పేర్కొన్నారని ఆరా మస్తాన్ చెప్పారు. ముఖ్యమైన సాక్షులను సిట్ విచారిస్తోందని, ఉన్నత స్థాయి అధికారులతో సిట్ ఏర్పాటు చేయడంతో దర్యాప్తు తుది దశకు చేరుకుందని అభిప్రాయపడ్డారు. వారం రోజుల్లో మళ్లీ విచారణకు పిలిచే అవకాశముందని తెలిపారు. ఈ కేసు త్వరలోనే ముగింపు దశకు చేరుకుంటుందని మస్తాన్ అన్నారు.



## వేములవాడ రాజన్న ఆలయానికి
# పోటెత్తిన భక్తులు

వేములవాడ, డిసెంబర్ 26 (భారత శక్తి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ముందు భక్తులు వేములవాడ రాజన్నకు కోడె మొక్కులతో పాటు వివిధ ఆర్జిత సేవల మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనికి తోడు వరుస సెలవులు రావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకొని అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని బోనాలు, పట్నం మొక్కులు చెల్లించారు. దీంతో క్యూలైన్లతో పాటు ఆలయ పరిసరాలు భక్తజనసంద్రంగా మారాయి. స్వామివారి దర్శనానికి 5గంటలకు పైగా సమయం పడుతోంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఈవో రమాదేవి పర్యవేక్షించారు. ఏఎస్పీ రిత్విక్ సాయి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

# "పిల్లాయిపల్లి కాలువలో గుర్రపు డెక్క ఆకు తొలగింపు"




అబ్దుల్లాపూర్ మేట్, డిసెంబర్ 26 (భారత శక్తి): వ్యవసాయ గ్రామాల అభివృద్ధికి సహాయ సహకారాల కోసం చేస్తున్న దివిస్ సేవలు అభినంధనీయమని ఇరిగేషన్ శాఖ డివిజనల్ ఇంజనీర్ కృష్ణా రెడ్డి అన్నారు. బండరావిర్యాల గ్రామం నుంచి చౌటుప్పల్ మండలంలో జైకేసారం గ్రామం వరకు 48 కిలోమీటర్ల మేరకు పిల్లాయిపల్లి కాల్వలో పూర్తిగా గుర్రపు డెక్క పేరుకుపోయింది. అందువలన సాగు నీరు అందక ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారని స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకు రావడం జరిగింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే సహకారంతో ఇరిగేషన్ డివిజనల్ ఇంజినీర్ కృష్ణారెడ్డి గుర్రపు డెక్క ఆకు తొలగింపు కాలవ పూడిక తీత పనులు దివిస్ ల్యాబోరేటరివ్ ఆర్థిక సహకారంతో పమలు ప్రారంభించారు. ఇరిగేషన్ డివిజనల్ ఇంజనీర్ మాట్లాడుతూ, దివిస్ ల్యాబ్ వారి సహకారంతో చేపట్టిన పనులు వలన సుమారు ఒక గ్రామంలో 30 వేల ఎకరాల మేరకు సాగునీరు ఎలాంటి ఆటంకం లేకుండా అందుతుందన్నారు. దివిస్ ల్యాబ్ కంపెని సిఎస్ఆర్ విభాగం అధికారి బి.గోపి మాట్లాడుతూ, సుమారు రూ.15 లక్షలు సిఎస్ఆర్ నిధులతో కాలువ పూడిక తీత పనులు, గుర్రపు డెక్క పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షులు కళ్ళెం రాఘవరెడ్డి, సర్పంచులు కందికంటి విజయ్ కుమార్ బండిరావిర్యాల గ్రామం, రుబ్బాత బాలకిషన్ గౌడ్ చిన్నరావిరాల గ్రామం, పెరుమాళ్ళు, మహాలక్ష్మిదానయ్య పిలామేపల్లి గ్రామం, ఇట్టమోని గౌత మహేష్ యాదవ్ జగతపల్లి గ్రామా కాసుల అంజయ్య గౌడ్. జూబారు గ్రామం, ఉప సర్పంచులు, సినియర్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ఇరిగేషన్ డిపార్టమెంట్ ఏఈ వెంకటరమణ దివిస్ ప్రతినిధులు, జీ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రజలకు పాదాభివందనం చేసినా తక్కువే: కేటీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 26 (భారత శక్తి): మేడిగడ్డను కూల్చివేసిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు చెక్‌డ్యామ్‌లను పేల్చివేస్తున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది కూల్చివేతలు, పేల్చివేతలు, ఎగవేతలు మాత్రమేనని వ్యాఖ్యానించారు. శేరిలింగంపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు నేడు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ''ఎన్నో హామీలిచ్చిన రేవంత్‌రెడ్డి అన్నీ ఎగవేశారు. ఆయన కిస్మత్ బాగుండి పేమెంట్ కోటాలో సీఎం అయ్యారు. హామీల గురించి ప్రశ్నిస్తే రేవంత్ బూతులు తిడుతున్నారు. తిట్ల భాష మాకూ వచ్చు.. కానీ మేం తిట్టం. పెంచుతామన్న పింఛన్లు ఎప్పటి నుంచి ఇస్తారో సీఎం చెప్పాలి. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను వరుసగా రెండుసార్లు గెలిపించారు. హైదరాబాద్ ప్రజలకు నేను పాదాభివందనం చేసినా తక్కువే. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ తట్టుకోలేరు'' అని కేటీఆర్ అన్నారు.

# 16 ఏళ్లలోపు వారికి సోషల్‌మీడియా బ్యాన్..
## మదురై బెంచ్ కీలక వ్యాఖ్యలు



మదురై, డిసెంబర్ 26 (భారత శక్తి): చిన్నారుల సామాజిక మాధ్యమాల వినియోగంపై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆస్ట్రేలియా తరహాలో 16 ఏళ్లలోపు చిన్నారులు సోషల్‌మీడియా నిషేధించే అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. ఎస్ విజయ్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్‌లో యథేచ్ఛగా అశ్లీల చిత్రాలు లభిస్తున్నాయని, వీటిని ఎవరైనా చూసే వీలుందని పిటిషనర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ఇవి చిన్నారుల జీవితాన్ని ప్రమాదంలో పడేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా ఎవరిపడితే వారు అశ్లీల చిత్రాలు, వీడియోలు చూడకుండా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. దీనిపై జస్టిస్ జి.జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌తో కూడిన ధర్మాసనం కీలక ఆదేశాలు ఇచ్చింది. పోర్నోగ్రఫీ కంటెంట్ చూడకుండా సాఫ్ట్‌వేర్ తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయపడింది. అలాగే, ఆస్ట్రేలియా తరహాలో 16 ఏళ్లలోపు వారు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా నిషేధం అంశాన్ని పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. అప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, బాలల హక్కుల కమిషన్ దీనిపై అవగాహన కల్పించే బాధ్యతను తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది.

# జలాంతర్గామిలో ప్రయాణించనున్న రాష్ట్రపతి



ఢిల్లీ, డిసెంబర్ 26 (భారత శక్తి): దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపదీ ముర్ము జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. డిసెంబరు 28న కర్ణాటకలోని కర్వార్ హార్బర్ నుంచి ప్రయాణం సాగించనున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం రాష్ట్రపతి భవన్ ప్రకటించింది. శనివారం నుంచి నాలుగు రోజుల పాటు ఆమె గోవా, ఝార్ఖండ్, కర్ణాటకలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలోనే జలాంతర్గామిలో ప్రయాణించనున్నారు. రెండు నెలల క్రితం కూడా రాష్ట్రపతి ఇలాంటి సాహసమే చేశారు. రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేశారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి రఫేల్ లో ప్రయాణించిన సంగతి తెలిసిందే. ఇక, 2023 మే 8న ద్రౌపదీ ముర్ము అస్సాంలోని తేజ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి సుఖోయ్ 30 ఎంకేఐ యుద్ధ విమానంలో విహరించారు. ఈ ప్రయాణం చేసిన రెండో మహిళా రాష్ట్రపతిగా ఆమె గుర్తింపు సాధించారు. అంతకుముందు 2009లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ఇదే ఫైటర్‌జెట్‌లో గగనయానం చేశారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా 2006లో పుణె వాయుసేన స్థావరం నుంచి సుఖోయ్ 30 యుద్ధ విమానంలో విహరించారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.